తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ. జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్

శుక్రవారం 9 అక్టోబర్ 2026

పేజీలు - 12


# క్షయ వ్యాధిని నిర్మూలించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం



- **కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08(జనంసాక్షి) :** జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్షయ నిర్మూలనకు యువత సన్నద్ధం - టి.బి. ముక్త్ పంచాయతీలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి అనేది అంటు వ్యాధి అని, ఇది ఒకరి నుండి ఇంకొకరికి సోకే వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు కలిగిన వారిని ఆరంభంలోని గుర్తించి, వారికి 6 నెలలపాటు చికిత్స, మంచి పోషకాహారం అందించినట్లయితే వ్యాధిని నిర్మూలించవచ్చని తెలిపారు. యువత, వైద్యులు, పంచాయితీ సర్పంచ్ లు, పాలకవర్గాలు తమ పరిధిలోని గ్రామాలలో క్షయ వ్యాధిపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తి సమాచారాన్ని వైద్య సిబ్బందికి తెలియజేయాలని, వారికి సరైన సమయంలో వైద్య చికిత్స అందించాలని, క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. అనంతరం క్షయ రహిత గ్రామపంచాయతీలుగా ఎంపిక అయిన ఆసిఫాబాద్ మండలం గోవింద్ పూర్, బెజ్జూర్ మండలం పోతేపల్లి, జైనూర్ మండలం పవార్ గూడ, కెరమెరి మండలం సాంగ్వి, సిర్పూర్ (టి) మండలం ఇటిక్యాలపహాడ్, వాంకిడి మండలం దాబా గ్రామాల సర్పంచ్ లు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సర్పంచ్ లు, వైద్యులు, ఎన్.సి.సి. విద్యార్థులు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

- **అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**బెల్లంపల్లి, అక్టోబర్ 8, (జనంసాక్షి) :** జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను తహసిల్దార్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఎంపిక చేసిన గ్రామాలలో రీ-సర్వే నిర్వహించడం జరుగుతుందని, రీ-సర్వే పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. పనులను మరింత వేగవంతంగా, నిబంధనల ప్రకారం, ఖచ్చితత్వంతో పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రీ-సర్వే కార్యక్రమానికి రైతులు సహకరిస్తున్నారని, ఇదే విధంగా అధికారులు, సిబ్బందికి సహకరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్వేయర్ వసంతరావ్, జిపిఓ శివకుమార్, చైన్ మెన్ రమేష్, మాజీ ఎంపీటీసీ మహేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో పోషకాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



వరకాల, అక్టోబర్ 8,(జనంసాక్షి): అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం, బాలల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.

పరకాలలోని ఆర్.ఆర్ గార్డెన్స్ లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. కేవలం అన్నం కాకుండా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పప్పులతో కూడిన సమతుల్య ఆహారం అవసరమన్నారు. జిల్లాలో సాూవీ, పీూవీ కేసులు గణనీయంగా తగ్గాయని, ఒక్క కేసు కూడా లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. తొలి వెయ్యి రోజులు తల్లీబిడ్డలకు అత్యంత కీలకమని, బాలామృతాన్ని లడ్డూలు, కేకుల రూపంలో పిల్లలకు ఇష్టంగా మార్చి అందించాలని సూచించారు. ప్రతి గ్రామంలో నెలకు ఒకసారి విలేజ్ హెల్త్, శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ డే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డీఎస్ వెంకన్న పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. పోషణపై ప్రతిజ్ఞ చేయించి, సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దకోడేపాకకు చెందిన 7 నెలల చిన్నారి మహాకు కలెక్టర్ అన్నప్రాసన చేశారు.

## పెండింగ్ కేసులపై సీరియస్ గడువులోగా పూర్తి చేయకపోతే

# శాఖాపరమైన చర్యలు తీసుకుంటా

- **ఇసుక లారీల వేగానికి బ్రేక్ రోడ్డు ప్రమాద నివారణకు కఠిన చర్యలు కఠిన చర్యలు...**
- **జిల్లా ప్రారంభం నుండి జిల్లా ముగింపు వరకు ప్రత్యేక అదనపు బలగాలతో 24/7 డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్...**
- **ఇసుక లారీలు స్పీడ్ లిమిట్ దాటితే ఇకపై సీజ్**



**ములుగు బ్యూరో, అక్టోబర్08(జనం సాక్షి):** ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, కోర్టు కేసుల పురోగతి,రోడ్డు ప్రమాదాల నివారణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్న కేసులపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. ప్రతి కేసును నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జాప్యానికి గల కారణాలపై సంబంధిత అధికారులను వివరణ కోరారు. నిర్దేశిత గడువులోగా కేసులను పరిష్కరించకపోతే బాధ్యులపై ఛార్జ్ మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో ఈ-సాక్ష్య వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేసి,సాధ్యమైనంత త్వరగా ఛార్జ్‌షీట్ నమోదు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోర్టు కానిస్టేబుళ్లు విధుల్లో సమయపాలన, సమయపాలనతో పాటు కేసులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై అవగాహన, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. కోర్టు కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పెంచే దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో 24/7 రౌండ్ ద క్లాక్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా అదనపు పోలీస్ సిబ్బందిని కేటాయించి నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు. స్థానిక పోలీస్ అధికారులు తమ పరిధిలోని లారీ డ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి,అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిద్రలేమి తదితర కారణాలతో మిగతా 15లో..

# వైన్ షాపుల దందాను అరికట్టాలి

- బెల్టు షాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారుల విఫలం
- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ



**టేకుమట్ల అక్టోబర్ 08 జనంసాక్షి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్ ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మాడుగుల వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాం రామచందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ టేకుమట్ల మండల కేంద్రంలో ఉన్నటువంటి రెండు వైన్ షాపులకు ఒక షాప్ కు మాత్రమే సిట్టింగ్ ఉన్నది ఇంకో షాపు విచ్చలవిడిగా గ్రామాలలో ఉన్నటువంటి బెల్టు షాపులకు అధిక రేట్లకు మందు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు ఒక గ్రామానికి ఐదు ఆరు బెల్ట్ షాపులు ఉన్నాయి మంచినీళ్ల కంటే మందు విపరీతంగా దొరుకుతుంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి యువకులు మద్యానికి బానిసై జీవితం మధ్యలోనే ముగిసి పోతుంది. అదే విధంగా విచ్చలవిడిగా నడుస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకుండా మామూళ్ల మత్తులో మునిగిపోతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తా ఉన్నారు తక్షణమే ఎక్సైజ్ సిఐని ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తా ఉన్నాం. అన్ని గ్రామాల్లో నడుస్తున్నటువంటి బెల్టు షాపుల్లో మద్యం ప్రియులకు అధికరేట్లకు బెల్ట్ షాపులు మద్యం ప్రియులను మోసం చేస్తున్నారు వారి జేబులను గుల్ల చేస్తా ఉన్నారు వాళ్ళ సంసారాలు రోడ్డున పడుతున్నాయి భార్య భర్తల గొడవలు విపరీతంగా పెరిగి పోతున్నాయి వీటిని అన్నింటిని కట్టడి చేయాల్సిన వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదు వైన్ షాప్ దగ్గర విచ్చలవిడిగా మద్యం ప్రియులు వెహికిల్స్ పెట్టడం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. తక్షణమే స్పందించి బెల్ట్ షాపులను రద్దుచేసి వైన్ షాప్ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం లేనియెడల అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నామని వారు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు పురుషోత్తం శంకర్ మాదిగ, గ్రామశాఖ అధ్యక్షులు మాడుగుల సదానందం, ఎమ్మార్పీఎస్ మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణలో పారదర్శకత అవసరం

- భూపాలపల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- సీఈసీ దిష్టిబొమ్మ దహనం





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఫారం-6,7,8 మార్పుల సవరణ డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. హనుమాన్ టెంపుల్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు సాగిన పాదయాత్ర అనంతరం సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, ఫారాల మార్పులపై ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగ హక్కు అని, ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగకుండా చూడాలని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), టీజేఎస్ నాయకులు సోతుకు ప్రవీణ్, గుర్రం దేవేందర్, మల్లేష్, అయిత ప్రకాశ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల,అక్టోబర్ 08, (జనంసాక్షి):** పరకాల ఆర్టీసీ డిపో యందు టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల సందర్భంగా టి డబ్ల్యూ యూ, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఐఎన్టియూసి కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుందని అన్నారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్య కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు.ఐక్య కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలకు ఉప్పరపల్లి విద్యార్థిని వర్షిణి ఎంపిక



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని వర్షిణి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలు గురువారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ క్రీడమైదానంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ విభాగం ఖోఖో ఎంపిక పోటీలలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జి. వర్షిణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 15, 16, 17వ తేదీలలో రంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటుందని వివరించారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వర్షిణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలను పాఠశాల ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, మొగిలి, సతీష్ కుమార్, రమాదేవి, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, గ్రామస్తులు అభినందించారు.

# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

### నా భవనాన్ని స్వచ్ఛందంగా కూల్చేస్తున్నా కౌన్సిలర్ కన్నం యుగదీశ్వర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తనపై కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని బీజేపీ నేత, 4వ వార్డు కౌన్సిలర్ కన్నం యుగదీశ్వర్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇందులో భాగంగా తన భవనం కూడా కూల్చివేతకు అధికారులు వచ్చారని తెలిపారు. దీంతో స్థానిక ఎమ్మెల్యేను కలిసి తనకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పినప్పటికీ, అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించడంతో స్వచ్ఛందంగా తన భవనాన్ని కూల్చేందుకు అంగీకరించానని చెప్పారు. గతంలో కూడా రోడ్డు వెడల్పులో తన భూమి పోయిందని, ఇప్పుడు మరికొంత పోతుందన్నారు. సింగరేణి కింద భూమి పోయినా తనకు రావాల్సిన పరిహారం ఇంకా చెల్లించలేదని, ఆ విషయాన్ని కోర్టులో చూసుకుంటానని ఆయన తెలిపారు.

## పూల పండుగతో పులకించిన శ్రీ అక్షర పాఠశాల

### ముందస్తు బతుకమ్మ వేడుకల్లో విరిసిన చిరునవ్వులు



**ముధోల్, అక్టోబర్ 08(జనం సాక్షి)** దసరా సెలవులను పురస్కరించుకొని శ్రీ అక్షర పాఠశాల, ముధోల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయినులు ఒకరోజు ముందే రంగురంగుల తంగేడు, గునుగు, బంతి పూలను సేకరించి అత్యంత అందంగా, ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినులు తెలంగాణ సంప్రదాయాన్ని ఉట్టిపడేలా రంగురంగుల లంగా ఓణీలను ధరించి, బతుకమ్మల చుట్టూ కోలాటాలు, బతుకమ్మ పాటలు, నృత్యాలతో అందరినీ అలరించారు.కార్యక్రమం అనంతరం పాఠశాల డైరెక్టర్ జారికొటె సుభాష్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను, అందులో దాగి ఉన్న సైన్స్, స్త్రీ శక్తి, తెలంగాణ సంస్కృతి గురించి విద్యార్థులకు అద్భుతంగా వివరించి, విద్యార్థులందరికీ ముందస్తు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్, ఉపాధ్యాయులు మధుసిందే, మహేందర్, సంతోష్, మహేందర్ తదితర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఇండియా కూటమి నేతల అరెస్టులు అప్రజాస్వామికం



**నల్లబెల్లి, అక్టోబర్ 08 (జనంసాక్షి):** ఓట్ల తొలగింపు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని నల్లబెల్లి మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పీఏసీఎస్ డైరెక్టర్ వైనాల అశోక్ విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకోవడం, అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఓట్ల అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం.. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అణచివేతకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ఎవరూ అణచివేయలేరని, ఓట్లను కాపాడుకోవడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అశోక్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్ నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# టీబీ రహిత లక్ష్యం ముందుకు సాగాలి

### ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 2030 నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. గురువారం ఐడీఓసీలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ రహిత గ్రామ పంచాయతీల సన్మానం, జోష్ బృందాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధిక ముప్పు ఉన్న గ్రామాలను గుర్తించి మొబైల్ ఎక్స్-రే వాహనాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టీబీ నిర్ధారణ అయిన వారికి నాలుగు నెలల పాటు ఉచిత వైద్యం, మందులు అందిస్తుండగా, బాధితులతో సన్నిహితంగా ఉండే వారికి వ్యాధి సోకకుండా మూడు నెలల పాటు ముందస్తు రక్షణ మందులు ఉచితంగా ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. చికిత్స పూర్తయ్యే వరకు బాధితులకు నెలకు రూ.1,000 చొప్పున పోషణ భత్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో టీబీ కేసులను గుర్తించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం మై భారత్ వాలంటీర్లతో జాయింట్ స్క్వాడ్, జోష్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారు సమీప ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తొలిదశలో గుర్తించి పూర్తి చికిత్స తీసుకుంటే టీబీని నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన 12 గ్రామ పంచాయతీల సర్పంచులను శాలువా, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, వైద్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను సంరక్షిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేయాలి

### ఎల్‌నినో పరిస్థితుల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 08 (జనం సాక్షి)**ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, జిల్లాలో ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని అన్నారు. గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటల వైపు వెళ్లకుండా, నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై రైతులకు సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 08(జనంసాక్షి):**ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం కోసం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు భూగర్భ శాఖ మంత్రి డా.వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం మందమర్రి తెలంగాణ మోడల్ పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చదువుపై ఆసక్తి పెంచడమే పథకం ఉద్దేశమన్నారు. విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. మందమర్రి మోడల్ పాఠశాల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని సోమన్‌పల్లిలో రూ.200 కోట్లతో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు వృత్తి విద్యా శిక్షణ అందిస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాగులు చెత్తబుట్టల పంపిణీ



**సారంగాపూర్, అక్టోబర్ 8 (జనం సాక్షి)**సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో సర్పంచ్ దండు సాయన్న ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులకు బ్యాగులు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. పారిశుద్ధ నిర్మాణానికి ఇంటి నుండే పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడెల్లి చైర్మన్ సింగం భోజగౌడ్, ఎంపీఓ అజీజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి రజిత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు జెర్సీలు అందించిన మాజీ సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్



**నెన్నెల, అక్టోబర్ 8 (జనం సాక్షి)**నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామంలో జరుగుతున్న చిత్తాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న భజరంగ్ స్ట్రైకర్స్ జట్టుకు నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్ జెర్సీలను స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన తోట సుజాత శ్రీనివాస్‌కు యువత, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో కూడా మరిన్ని సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తాపూర్ మాజీ సర్పంచ్ బత్తిని పద్మ వెంకటేష్, చొక్కాల నగేష్, దారావత్ గణేష్‌తో పాటు గ్రామ యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సాంగ్వి పంచాయతీకి టీబీ ముక్త్ గుర్తింపు



**కెరమెరి, అక్టోబర్ 8 (జనంసాక్షి)**కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హాజరయ్యారు. ఇందులో భాగంగా కెరమెరి మండలం సాంగ్వి గ్రామ పంచాయతీకి 2025 సంవత్సరానికి టీబీ రహిత పంచాయతీగా గుర్తింపు లభించింది. ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. సర్పంచ్ కర్నెత్ విమలాబాయి నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శి, ఎంఎల్హెచ్పి, ఏఎన్ఎం, ఆశా, ఆరోగ్య సిబ్బంది చేసిన కృషిని కలెక్టర్, డీఎంహెచ్ఓ అభినందించారు. టీబీ అనుమానితుల గుర్తింపు, పరీక్షలు, చికిత్సలో సహకారం కొనసాగించాలని సూచించారు.

# కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నా



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 08(జనంసాక్షి):**ఓట్ల తొలగింపు ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మందమర్రిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఫ్లైఓవర్ కింద నిరసన చేపట్టారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ధర్నాలో పాల్గొన్నారు. చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, యువజన, మహిళా, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఆర్ట్స్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 8 (జనం సాక్షి)** :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ వేడుకలకు తెలంగాణ మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద ప్రత్యేక ఆహ్వానితురాలిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య బొద్దిరెడ్డి రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ అనిత రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి విశ్వజ, రాష్ట్ర నాయకురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ప్రముఖులు పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి తెలిపారు. విద్యార్థినులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో భాగస్వామ్యమై బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తెలంగాణ పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ ద్వారా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, మహిళల సామాజిక, సాంస్కృతిక భాగస్వామ్యాన్ని చాటిచెప్పేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ పండుగ విశిష్టతను యువతకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు.

# పిఏసిఎల్ భూములపై గ్రామసభలు నిర్వహణ



సారంగాపూర్, అక్టోబర్ 8 (జనం సాక్షి) జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలంలోని పి ఏ సి ఎల్ భూములకు సంబంధించిన గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కంకేట, తాండ్ర, వంజర్ మరియు చించోలి (ఎం) గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ఈ గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం పిఏసిఎల్ సంస్థ ఆధీనంలో ఉన్న భూములు కాకుండా, ఇతర పట్టా భూములు 22- ఏ జాబితాలో నమోదు చేయబడినట్లయితే, సంబంధిత పట్టాదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి, వాటిపై సమగ్ర విచారణ నిర్వహించడం, అవసరమైన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, అర్హత ఉన్న సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరిగింది. గ్రామసభల సందర్భంగా సంబంధిత భూముల వివరాలు మరియు 22- ఏనమోదుకు సంబంధించిన అంశాలను గ్రామస్థులకు వివరించి, వారి సమస్యలు మరియు అభ్యంతరాలను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయ్ కాంత్ రావ్, ఆర్ ఐ వెంకట నర్సయ్య, జి పి ఓలు నవీన్, రాజా లింగం, సవిత సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**నెరడిగొండ అక్టోబర్8(జనంసాక్షి):** బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత కు ప్రతీక అని నెరడిగొండ సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఆనందంగా వేడుకలను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. యువత మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థినులు బతుకమ్మలను ఆడుతూ ఉత్సాహంగా వేడుకలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ప్రిన్సిపాల్ షబానా తరన్నం,సుజాతబాయి మమత జాహ్నవి రేఖ లతోపాటు అధ్యాపక బృందంకళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ముధోల్‌లో కాంగ్రెస్ "బ్లాక్ డే" - నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ముధోల్, అక్టోబర్ 08(జనం సాక్షి)** ఏఐసీసీ పిలుపు మేరకు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ శాసనసభ్యులు గౌరవ శ్రీ వెడ్మ భొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ముధోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ డే నిరసన కార్యక్రమం చేపట్టారు. లోక్ సభ ప్రతిపక్ష నేత, తమ ప్రియతమ నాయకులు గౌరవ శ్రీ రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ఈరోజును బ్లాక్ డే గా ప్రకటించి, మాజీ శాసన సభ్యులు జీ. విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాపేవారి కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, జిల్లా జనరల్ సెక్రెటరీ పోతన యాదవ్, జిల్లా సెక్రెటరీ బషీర్, ఎస్సీ సెల్ జిల్లా సెక్రెటరీ విట్టల్ కంబ్లె, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు విశ్వంభర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు మహేందర్, అశోక్, అనిల్, గంగ శేఖర్, వాజీద్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల ఆర్థిక సహాయం



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** మృతురాలి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని 16 చింతల తండ గ్రామానికి చెందిన బోడ దయాకర్ తల్లి బోడ ఈరమ్మ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. బిఆర్ఎస్ నాయకులు బానోత్ లక్ష్మణ్ నాయక్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్ లు గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బోడ దయాకర్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు బానోతు లక్ష్మణ్ నాయక్ మృతురాలి కుటుంబానికి 25కిలోల బియ్యం, రూ.2 వేల ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు నంద నాయక్, బోడ రవి నాయక్, వార్డు సభ్యులు గుగులోతు రవి, బానోత్ రాంజీ, అక్రిదంజి, గ్రామ నాయకులు బానుతు జుమ్లాల్, మోతిలాల్, రాజన్న, గుగులోతు శ్రీను, జరుపల నర్సు, యూత్ నాయకులు గుగులోతు కళ్యాణ్, హరిచంద్, జరుపుల నర్సు, మాలోత్ లచ్చు, కిషన్, బోడ స్వామి, బానోత్ బద్రు, తిరుపతి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం

### పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి



**పరకాల అక్టోబర్ 8 ( జనం సాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని అన్ని వార్డులలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పరకాల పట్టణాన్ని ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడంలో ప్రజలు సహకరించాలని అన్నారు. గత బిఆర్ఎస్ పాలకుల మోసపూరిత మాటలతో పరకాల పట్టణం వెనుకబడిందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడం అనైతికం

### చెన్నారావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి ):** ఓట్ల తొలగింపు, ఓట్ల చోరీ, సర్ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం అని చెన్నారావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకోవడంను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఓట్ల అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న వారిపై అణచివేతకు పాల్పడటం దుర్మార్గం అని ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ఎవరూ అణచివేయలేరన్నారు. ఓట్లను కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

## తెలంగాణ సాంస్కృతిక సారథి కళా ప్రదర్శన



**తాండూర్, అక్టోబర్ 08(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పౌరసంబంధాల అధికారి ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. గత 1000 రోజులలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన వివిధ ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం తమ ఆట, పాటలు మరియు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రభుత్వ పథకాల విశిష్టతను గ్రామ ప్రజలకు ఎంతో సులభంగా అర్థమయ్యేలా వివరించింది. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలా చేరుతున్నాయో కళాకారులు తమ నటనతో కళ్లకు కట్టారు. ఈ అవగాహన జాతలో సాంస్కృతిక సారథి టీం లీడర్ కొప్పర్తి సురేందర్ నేతృత్వంలో కళాకారులు కుమ్మరి శ్రవణ్ కుమార్, కొప్పర్తి రవీందర్, బీరుపూరి శ్రీనివాస్, సల్లూరి కిష్టయ్య, కాసిపేట సంతోష్, వావిలాల నాగలక్ష్మి తమ అద్భుత ప్రదర్శనలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కాసిపేట గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాకారులను అభినందించారు.

# బతుకమ్మ పండుగకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

## సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్



**తాండూర్, అక్టోబర్ 08(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగ వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో విద్యుత్ లైటింగ్ వ్యవస్థకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పని చేయని వీధిలైట్లను గుర్తించి వాటి స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేసి, విద్యుత్ స్తంభాలకు ఫిట్టింగ్ చేయాలని సూచించారు. పండుగ సందర్భంగా రాత్రి వేళల్లో గ్రామ ప్రజలకు మెరుగైన వెలుతురు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బతుకమ్మ పండుగను ప్రతి గ్రామంలో ప్రజలందరూ సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేవలం విద్యుత్ దీపాలు మాత్రమే కాకుండా, గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కొండు బానేష్ అధికారులను కోరారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

## యోగ, లాంగ్‌జంప్‌లో ప్రతిభ.. రాష్ట్రస్థాయికి ఎంపిక




**దిలావర్‌పూర్, అక్టోబర్08, (జనం సాక్షి):** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి యోగా పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని సోని అద్భుత ప్రదర్శనతో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఆమె ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు సిద్ధిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. అలాగే, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాంగ్‌జంప్ పోటీల్లో 7వ తరగతి విద్యార్థి రాథోడ్ లక్ష్మణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఇతడు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్ పోటీల్లో పాల్గొననున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను మండల విద్యాధికారి (వీజూ) సదానందం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పీడీ గుగ్లావత్ అంబాజీతో పాటు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# విద్యా భారతి హైస్కూల్‌కు జాతీయ స్థాయి 'డైనమిక్ స్కూల్ అవార్డు'

## హైదరాబాద్ సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్ -- 2026లో ప్రదానం

## హర్షం వ్యక్తం చేసిన పాఠశాల చైర్మన్ ఆగమారావు, డైరెక్టర్ శరత్ కుమార్

**తాండూర్, అక్టోబర్ 8(జనం సాక్షి)** హైదరాబాద్‌లో వైభవంగా జరిగిన 'సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్ 2026'లో తమ విద్యా భారతి హైస్కూల్‌కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక 'డైనమిక్ స్కూల్ అవార్డు' లభించినట్లు పాఠశాల డైరెక్టర్ శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో జీ న్యూస్ నెట్‌వర్క్ సీఈఓ అనిల్ శర్మ చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యం ఈ అవార్డును అందుకుంది. విద్యాబోధన అంశాలలో వినూత్న విధానాలు, విభిన్నతను ప్రదర్శించినందుకు గానూ జాతీయ స్థాయిలో విద్యా భారతి సంస్థను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈ పురస్కారం దక్కడం సంస్థ పనితీరుకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సౌమ్య రావు కూడా పాల్గొన్నారు. సిబ్బంది కృషి అమోఘం: చైర్మన్ ఆగమారావు విద్యా భారతి హైస్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల సంస్థ చైర్మన్ ఆగమారావు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అంకితభావంతో, నిరంతర కృషి చేయడం వల్లే ఈ గౌరవం దక్కిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది అందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన నాణ్యమైన విద్యను అందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని యాజమాన్యం ధీమా వ్యక్తం చేసింది.




# మీడియా రంగానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం

- వాస్తవ, విశ్వసనీయ సమాచారమే జర్నలిస్టుల లక్ష్యం కావాలి
- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**మావల అక్టోబర్ 09( జనం సాక్షి):** సమాజంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీ హాల్‌లో విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వార్తల సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, రచన, ప్రసారం వంటి ప్రతి దశలో జర్నలిస్టులు అప్రమత్తంగా వ్యవహరించాలని శ సూచించారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం క్షణాల్లో విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. వార్తను వేగంగా అందించడం కంటే, వాస్తవాలను నిర్ధారించి బాధ్యతాయుతంగా ప్రజలకు అందించడం ముఖ్యమని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలకు తావులేకుండా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడమే పాత్రికేయుల ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తోందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సేవల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక విలేకరుల పాత్ర అభినందనీయమన్నారు. వార్తలో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



మారుతున్న మీడియా అవసరాలకు అనుగుణంగా జర్నలిస్టులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి అకాడమీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్మెన్ తెలిపారు. రెండు రోజుల శిక్షణలో అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల పాత్ర ఎంతో ప్రాధాన్యమైనదని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్న తీరును తెలియజేయడంలో మీడియా కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తలను అందిస్తూ సమాజ అభివృద్ధికి జర్నలిస్టులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వార్తా సేకరణలో నూతన పద్ధతులు, వార్తల వాస్తవ నిర్ధారణ, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వినియోగం, పాత్రికేయ నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జర్నలిజంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై నిపుణులు విలేకరులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, డీపీఆర్వో విష్ణు వర్ధన్, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, వినోద్, సురేష్, సుభాష్, కిరణ్ తదితరులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులను సంరక్షించుకుంటేనే జీవన మనుగడ

**నెన్నెల, అక్టోబర్ 8 (జనం సాక్షి )** నెన్నెల వన్యప్రాణులను సంరక్షించుకుంటేనే జీవన మనుగడ సాధ్యమవుతుందని బెల్లంపల్లి అటవీ డివిజనల్ అధికారి విజయ్ కుమార్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నెన్నెల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవులు, వన్యప్రాణుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి పి. దయాకర్, డీఆర్వో ప్రవీణ్ నాయక్, అటవీ బీట్ అధికారి మహేష్, ఎస్ఓ కవిత తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్ అన్నారు.నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు చెన్నారావుపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి హరీష్ ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ ముఖ్య అతిథిగా పాల్గొని గురువారం చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, తిమ్మరాయిన్ పహాడ్, భోజేర్వు యూత్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పాపయ్యపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మేడి సాయి కృష్ణ, ఉపాధ్యక్షులుగా కాట ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా కన్నం విజయ్, మీడియా కోఆర్డినేటర్‌గా మేడి రాకేష్, తిమ్మరాయిన్ పహాడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మహమ్మద్ హుజూర్ పాషా, ఉపాధ్యక్షులుగా ఎదనపెల్లి జయరాజ్, ప్రధాన కార్యదర్శిగా మినుముల నరేష్, మీడియా కోఆర్డినేటర్ గా మోతె ఈశ్వర్, భోజేర్వు గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మాలోతు రమేష్, ఉపాధ్యక్షులుగా బండి సాంబరాజు, ప్రధాన కార్యదర్శిగా గడ్డల రాజు, మీడియా కోఆర్డినేటర్ గా రాధారపు రంజిత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు నూతన కమిటీ బాధ్యులకు నియామక పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకటరెడ్డి, సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, భోజేర్వు సర్పంచ్ కుసుమ సతీష్, పాపయ్యపేట, తిమ్మరాయిన్ పహాడ్ భోజేర్వు గ్రామ అధ్యక్షులు ఉప్పరి కొమురయ్య, ఏటుకూరి జయరాజ్, పావురాల ఐలయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్, ఖానాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలగందుల రాజు, రాధారపు బిక్షపతి వినోద్, అనిల్, విజయ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కాళేశ్వరం , అక్టోబర్ 8 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా నమోదయ్యే నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతలు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించిన ఎస్పీ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మార్కింగ్ ప్రకారం రోడ్డు వెడల్పు పనులను నిర్వహించాలి

### లింగగిరి గ్రామ సర్పంచ్, కార్యదర్శికి వినతి



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** లింగగిరి గ్రామంలో మార్కింగ్ ప్రకారం రోడ్డు వెడల్పు పనులను నిర్వహించాలని లింగగిరి గ్రామస్తులు మాదారపు శ్రీనివాస్, పసునూటి స్వామి, జంగిలి శ్రీకాంత్, ఈసంపెల్లి వీరన్న, చిందం కుమార్, రాకం నరసమ్మ, పులి అశోక్ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని లింగగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్యాం ప్రసాద్ లకు వినతి పత్రాన్ని అందించారు. గ్రామంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టడానికి గ్రామపంచాయతీ, గ్రామ పెద్దల సమక్షంలో ఒక నిర్ణయం తీసుకొని మార్కింగ్ చేసినట్లు తెలిపారు. కాని కొందరి ఇళ్ళ ముందు మార్కింగ్ ప్రకారం రోడ్డు వెడల్పు పనులు నిర్వహించడం లేదన్నారు. రోడ్డు వెడల్పు పనులను అందరి ఇళ్ళ ముందు సమన్యాయంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీను, బద్రి, సతీష్, రమేష్, అశోక్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల బ్లాక్--2లో కొత్త ఇళ్ల గుర్తింపు

- భూసర్వేకు ముందే ప్రక్రియ తహసిల్దార్ రవికుమార్,
- ఎంపీడీవో క్రాంతి కుమార్



**మల్హర్, అక్టోబర్ 08 (జనంసాక్షి)** తాడిచర్ల బ్లాక్--2 బొగ్గు గని కోసం భూసేకరణకు సంబంధించిన భూసర్వే ప్రక్రియ ప్రారంభానికి ముందే ఎలాంటి ప్రకటన లేకుండానే అధికారులు గురువారం రోజు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు సమాచారం. తాడిచర్ల అమ్మేట్ గ్రామంలోని శాత్రాజ్‌పల్లిలో ఇప్పటికే ఉన్న ఇళ్లతో పాటు ఇటీవల నిర్మించిన గృహాలను కూడా గుర్తించి ఏ,బీ,సీ,డీ సిరీస్‌లతో నంబర్లు వేసినట్లు తెలిసింది.ఈ ప్రక్రియలో శాత్రాజ్‌పల్లిలో మొత్తం సుమారు 500 పైచిలుకు గృహాలు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఇటీవల కొన్ని కొత్త ఇళ్ల నిర్మాణాలు కూడా జరుగుతున్న నేపథ్యంలో వాటిని సైతం అధికారులు గుర్తించి వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. తాడిచర్ల బ్లాక్--2 గనిని కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశంలోనే 'బాహుబలి మైన్'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రాంతంపై మరింత దృష్టి నెలకొంది. ఈ నేపథ్యంలో సింగరేణి, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఇళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు సమాచారం. నూతన గృహాలు ఇకముందు నిర్మించకుండా ముకుతాడు వేసినట్లు అయింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే. రవికుమార్, ఎంపీడీవో క్రాంతికుమార్, తాడిచర్ల కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, సింగరేణి అధికారులు, కొయ్యూరు ఎస్ఐ పి.మహేందర్ కుమార్ యాదవ్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, సింగరేణి సిబ్బంది పాల్గొన్నారు.

# టీబీ రహిత గ్రామంగా చిన్నమడూరు: కలెక్టర్ ప్రశంసా పత్రం

### సర్పంచ్ మైదం జోగేశ్వర్‌కు అభినందనలు తెలిపిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**దేవరుప్పుల, అక్టోబర్ 08 (జనం సాక్షి):** టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనలో విశేష కృషి చేసిన చిన్నమడూరు గ్రామ పంచాయతీకి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రశంసా పత్రం అందజేశారు. జనగామ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని చిన్నమడూరు గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్ అందుకున్నారు.గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పాలకవర్గం, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు చేసిన సమిష్టి కృషికి ఈ ప్రశంస దక్కింది. కార్యక్రమంలో ఎంపీడీవో మేనక పౌడెల్, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మైదం జోగేశ్వర్ మాట్లాడుతూ.. చిన్నమడూరును టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములైన గ్రామ పాలకవర్గం, అధికార యంత్రాంగం, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అలాగే నిరంతరం సహకరించిన గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రం అందుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేతను వెంటనే నిలిపివేయాలి

- దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తోంది
- హైకోర్టు స్టే ఉన్నా ఇళ్లను కూల్చడం కోర్టు ధిక్కరణే
- మీడియా సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 8 (జనం సాక్షి) :హనుమకొండ బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మర్రి యాదవ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భద్రకాళి ఆలయం వెనకాల ఉన్న చరబండ్ల రాజుల కాలనీ వాసుల సమస్యలను ప్రస్తావిస్తూ పేదలు, దళితుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. మీడియా సమావేశంలో కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ..భద్రకాళి ఆలయం వెనకాల ఉన్న చరబండ్ల రాజుల కాలనీ వాసులే తమ సమస్యల పరిష్కారం కోసం బండలు కొట్టి దారి ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లను అక్రమంగా కూల్చివేయడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే దళితులు, పేదలపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు దళితులకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కన పెట్టి మోసం చేసిందని ఆరోపించారు.ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు.. నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తూ ఏ రకమైన రాజ్యాన్ని తీసుకొస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని మర్రి యాదవ రెడ్డి ప్రశ్నించారు. ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినప్పుడు వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని, అందుకు భిన్నంగా పేదలపై కఠినంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు.హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ ఇళ్లను కూల్చివేయడం జరిగితే అది తీవ్రమైన అంశమని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.మాజీ కార్పొరేటర్ జోరికే రమేష్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో రాహుల్ గాంధీ చేస్తున్న ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల పహారాలో ధర్నాలు చేస్తున్నారని, అదే సమయంలో రాష్ట్రంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని జోరికే రమేష్ విమర్శించారు.

## మూడోసారి భీం వర్ధంతి కమిటీ చైర్మన్‌గా రాజేశ్వర్



**కెరమెరి,అక్టోబర్ 8 (జనంసాక్షి)** కొమురం భీమ్ వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ గా పెంధోర్ రాజేశ్వర్ మూడోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవా లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ నెల 26న జోడేఘాట్‌లో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వసతి, రవాణా తదితర ఏర్పాట్లను ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో చేపడతామని రాజేశ్వర్ తెలిపారు.

## విజయ సాయి స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**కుంటాల,అక్టోబర్ 08(జనం సాక్షి ):** స్థానిక విజయ సాయి స్కూల్‌లో తెలంగాణ సంస్కృతిని,సంప్రదాయాన్ని ప్రతిబింబించే ముందస్తు బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. స్వప్న మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అలవాటు చేయడమే లక్ష్యంగా పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో ఈ ముందస్తు బతుకమ్మ సంబరాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

## నిర్మల్‌లో అట్టహాసంగా మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 8, (జనంసాక్షి )** ప్రముఖ వస్త్ర సంస్థ మాంగళ్య షాపింగ్ మాల్ 34వ శాఖ నిర్మల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమైంది. సినీనటి భాగ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అభిమానులతో మమేకమయ్యారు. కార్యక్రమంలో ఎంపీ గెడెం నగేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. నిర్మల్‌లో మాంగళ్య శాఖ ఏర్పాటుతో స్థానికులకు నాణ్యమైన వస్త్రాలు సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం ఆధునిక వస్త్రాలతో పాటు వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రూ.99 నుంచి రూ.లక్ష వరకు వివిధ ధరల్లో వస్త్రాలు లభిస్తాయని తెలిపారు.

## కందిగడ్డ తండాలో పోషణ మాస ముగింపు కార్యక్రమం



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** మండలంలోని కంది గడ్డ తండా గ్రామంలో పోషణ మాస ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కంది గడ్డ తండా గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోషణ విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సహదేవుడ జ్యోతి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్వాడీ టీచర్లు విజయ, వినోద, సుజాత, వనిత, పూల, ఆయాలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

## తాండూరు మండల కేంద్రంలో నూతన ఆటో ధరల పట్టిక ఆవిష్కరణ

### ఆటో కార్మికులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి: మాజీ జడ్పీటీసీ శాలిగామా బానయ్య



**తాండూర్, అక్టోబర్ 08(జనం సాక్షి)** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తాండూరు మండల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన ధరల పట్టికను గురువారం తాండూరు మండల కేంద్రంలోని ఐబి ఫ్లైఓవర్ కింద ఆవిష్కరించారు. తాండూర్ మండల్ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ శాలిగామా బానయ్య ముఖ్య అతిథిగా హాజరై, ఆటో కార్మికులు, ప్రజల సమక్షంలో ఈ నూతన ధరల పట్టికను విడుదల చేశారు. నిన్న తాండూరు మండలంలో నిర్వహించిన సంపూర్ణ బంద్ అనంతరం నేటి నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శాలిగామా బానయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో ఆటోలు నడపడం భారంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యూనియన్ నిర్ణయించిన కనీస ధర రూ. 20, ఎంవీకే-3 కి రూ. 30, బెల్లంపల్లికి రూ. 30, మంచిర్యాలకు రూ. 70 ధరలు అత్యంత న్యాయబద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ధరల పెంపునకు తాండూరు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ సహకరించి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ఆటో కార్మికులకు ఆయన పలు సూచనలు చేశారు. కుటుంబ బాధ్యతలను, భార్యాపిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని హితవు పలికారు. ఆటోలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు (ఫిట్నెస్, పర్మిట్లు), ఇన్సూరెన్స్, జీవిత బీమా వంటివి కచ్చితంగా చేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల్ ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా, ఉపాధ్యక్షుడు చాంద్ ఖాన్, సంయుక్త కోశాధికారి రఫీ ఖాన్ (అలియాస్ కట్టప్ప), మండల సలహాదారుడు విద్యాసాగర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రేగుల రవి, ఆశుమ్ అలీ, సంయుక్త కార్యదర్శి పల్లె వెంకటేష్, తీర్మాన కమిటీ మెంబర్ గుమ్మడి పోషమల్లు వీరితో పాటు మాదారం అడ్డా ఉపాధ్యక్షుడు దండుగుల రమేష్, ఎన్.వికే-3 కోశాధికారి అభి, ఐబి అడ్డా అధ్యక్షుడు త్రిబుల్ ఆర్ రియాజ్, కోశాధికారి ఫయీమ్ భాయ్, తాండూర్ బస్టాండ్ అధ్యక్షుడు డోలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జిమిక్స్ రవి, బోయపల్లె బోర్డ్ అధ్యక్షుడు శశి ఠాగూర్, నరసాపూర్ అడ్డా అధ్యక్షుడు కన్నయ్య, ఉపాధ్యక్షుడు భీమ్ రావు మరియు భారీ సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీలో ముందడుగు - కెరమెరి మండలంలో 66 శాతం పూర్తి

**కెరమెరి, అక్టోబర్ 8 (జనంసాక్షి)** రైతుల సమగ్ర వివరాలు ఒకే వేదికపై నమోదు చేసి భవిష్యత్తులో వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను మరింత పారదర్శకంగా అందించేందుకు చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కెరమెరి మండలంలో వేగంగా కొనసాగుతోంది. మండలంలో ఇప్పటి వరకు 66 శాతం మంది రైతులు వివరాలు నమోదు చేసుకున్నారు. మిగిలిన రైతుల వివరాలను కూడా నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమ వివరాలు నమోదు చేసుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వం అందించే సేవలు, ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు వీలు కలుగుతుంది. రైతులు పండించే పంటల డిజిటల్ నమోదు కూడా సులభంగా అవుతుంది. రిజిస్ట్రీ ఉంటే రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్ పథకాలు వస్తాయి.

**మండల వివరాలు:**

గ్రామ పంచాయతీలు - 31
రైతులు - 7,910
రిజిస్ట్రీ చేసుకున్న రైతులు - 5,283
పెండింగ్ ఉన్న రైతులు - 2,627
నమోదైన శాతం - 66.8



**రైతుకు ప్రత్యేక గుర్తింపు:**

ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుకు సంబంధించిన భూమి, పంటలు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేస్తారు. రైతు వివరాల ఆధారంగా అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా వ్యవస్థ రూపొందిస్తున్నారు. రైతుల వివరాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉండడంతో ప్రభుత్వానికి వ్యవసాయ రంగంపై సమగ్ర సమాచారం లభించనుంది. ఫార్మర్ రిజిస్ట్రీ నిరంతర ప్రక్రియ ఇప్పటి వరకు నమోదు చేయని రైతులు వెంటనే వివరాలు అందజేయాలి. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలి అని ఏఈవో యోగేందర్ తెలిపారు.

## నిరుద్యోగ ఆదివాసులకు ఏజెన్సీ పత్రాలు ఇవ్వాలి

- ఆదివాసి అస్తిత్వం కొరకు ప్రతి ఒక్క ఆదివాసి పోరాడాలి
- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు నల్లబోయిన లక్ష్మణ్ దొర



**మంగపేట, అక్టోబర్ 08(జనం సాక్షి)** మండలంలోని తిమ్మంపేట గ్రామపంచాయతీ ఆవరణంలో గురువారం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లబోయిన లక్ష్మణ్ దొర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు బాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసి చట్టాలు పంచాయతీరాజ్ వ్యవసా చట్టం 2006 ను పూర్తిగా అమలు చేయాలని అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్నటువంటి నిరుద్యోగ యువతకు ఏజెన్సీ సర్టిఫికెట్లను జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆదివాసి చట్టాలు ఆదివాసీల అస్తిత్వం కొరకు ప్రతి ఒక్క ఆదివాసి కలసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల నూతన కమిటీని ఎన్నుకోగా మండల అడ్వైజర్ గుమ్మడి సారయ్య, గౌరవ అధ్యక్షులు కోరెం మొగిలి, మండల అధ్యక్షుడు పూణెం ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి కొమరం శివాజీలు ఎన్నిక కాగా ఆదివాసి విద్యార్థి విభాగం నూతన మండల కమిటీని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా మండల నూతన గౌరవ అధ్యక్షుడిగా పాయం సతీష్, మండలాధ్యక్షుడిగా గొట్టం ప్రకాష్ ప్రధాన కార్యదర్శిగా కొండ సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు పాల్గొన్నారు.

# పోషక విలువలు కలిగిన ఆహారంతోనే ఆరోగ్యం

- వరంగల్ జిల్లా సంక్షేమ అధికారిని రాజమణి
- తిమ్మరాయిని పహాడ్‌లో పోషణ మాస ముగింపు వేడుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** పోషక విలువలు కలిగిన ఆహారంతోనే ఆరోగ్యవంతంగా ఉంటామని వరంగల్ జిల్లా సంక్షేమ అధికారిని రాజమణి అన్నారు. గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాస ముగింపు వేడుకలను చెన్నారావుపేట మండల పరిధిలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పటిష్టమైన పోషకాహారము మరియు మౌలిక వసతులను అందిస్తుందన్నారు అంగన్వాడీ కేంద్రాలలో జరిగే ఈ సేవలను గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా ఉన్న కమిటీ సహాయ సహకారాలతో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, పెరటి తోటలో పెంచిన తాజా ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడానికి అలవాటు చేసుకోవాలని పాత ఆహార పద్ధతులు పాటించడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని తెలిపారు. స్థానిక సర్పంచ్ ధారావత్ రమేష్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ప్రతి ఒక్కరు అంగన్వాడి కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను పటిష్టం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మాణం చేయడానికి భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏసిడిపిఓ జ్యోతి, సూపర్వైజర్స్ రాధ, పద్మలత, రమ, భాగ్యమ్మ, జయరాణి, నజ్మా, వాసంతి, యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీష, చెన్నారావుపేట మండల అధ్యక్షురాలు ఏటుకూరి అరుణకుమారి, సెక్టార్ లీడర్స్ కృష్ణవేణి, పుష్పలత, అంగన్వాడీ టీచర్స్ మేరీ రాజ్యం, కవిత, సుగుణ, రమ, మంజుల, రాణి, ఆశా కార్యకర్త అనిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# రూ.50 వేల కోసం హత్య నిందితుడికి జీవిత ఖైదు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(జనంసాక్షి):** కవలం రూ.50 వేల కోసం మనిషిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ గురువారం సంచలన తీర్పు వెలువరించారు. న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.4 వేల జరిమానా విధించింది.

**వివరాల్లోకి వెళితే**

జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన పెరుగు రమేష్ (26) తన పరిచయస్తుడైన పర్లపెల్లి గ్రామానికి చెందిన అక్కపెల్లి మల్లయ్యతో కలిసి 2020 సెప్టెంబర్ 4న ఆకినపల్లిలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ మల్లయ్య తన వ్యక్తిగత అవసరాల కోసం రూ.50 వేలు విత్ డ్రా చేసుకున్నాడు. డబ్బు తీసుకున్న తర్వాత ఇద్దరూ రమేష్ కు చెందిన ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మరుసటి రోజు పర్లపెల్లి గ్రామ శివారులోని మల్లయ్య వ్యవసాయ క్షేత్రంలోని బావిలో మల్లయ్య మృతదేహం లభ్యమైంది. అప్పట్లో ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఐదేళ్లుగా విచారణలో ఉన్న ఈ కేసులో సాక్ష్యాధారాలను, పూర్వాపరాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి నిందితుడు పెరుగు రమేష్ కు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. నేరస్వభావం కలిగిన వ్యక్తులకు ఈ తీర్పు కనువిప్పు కావాలని, నేరానికి పాల్పడితే శిక్ష తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# హనుమ నాయక్‌ను పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్

## సొసైటీ చైర్మన్లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** మండలంలోని శంకరం తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భూక్య హనుమ నాయక్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, చెన్నారావుపేట, అమీనాబాద్ సొసైటీ చైర్మన్‌లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డిలు పరామర్శించారు. శంకరం తండా గ్రామానికి చెందిన భూక్య హనుమనాయక్ తండ్రి గ్రామ సర్పంచ్ లావణ్య మామ భూక్య మంగ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డిలు మంగ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది క్రిష్ణ చైతన్య రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షులు భూక్య మైబుసింగ్ రాథోడ్, కాంగ్రెస్ మండల కార్యదర్శి భూక్య మెహన్ నాయక్, మండల నాయకులు భూక్య సురేష్, గూడ మహేందర్, వెంకన్న, బాలు నాయక్, పురం రాంబాబు, సర్పంచ్ లు దార రంజిత్, బానోతు విక్రమ్, గుగులోతు బాలు నాయక్, జినుకల కనకమల్లు, బోడ రవి, సతీష్, మైదం రాకేష్, బోడ వీరాసింగ్, మాలోతు రాంచంద్రు నాయక్, లావుడియా చందునాయక్, రమేష్ నాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బండి హరీష్, బద్రు, రమేష్, సూర్య, పాల్గొన్నారు.

# కెజీబీవీ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా

## విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి



**మావల అక్టోబర్ 09( జనం సాక్షి):** విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజీబీవీ) జూనియర్ కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతి గృహం, వంటగది, భోజన ప్రదేశం, పరిసరాలను పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధన, వసతి, భోజనం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి చదువు, భోజనం, వసతి సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని యోగితా రాణా సూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి ధైర్యంగా తీసుకురావాలని అన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఆమె, భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు. ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటగది, భోజన ప్రదేశం, పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, ఆహారం తయారీ, నిల్వ, వడ్డింపులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మంద మకరంద్, విద్యాశాఖ అధికారి మాధవి, కళాశాల ప్రిన్సిపల్ దీప్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీలాయపల్లిలో వైద్య ఆరోగ్య శిబిరం

## దోమల నివారణ మందు పిచికారీ



**తాండూర్, అక్టోబర్ 08(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా: తాండూరు మండలం నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం నాడు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్య శిబిరంతో పాటు గ్రామంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా నీలాయపల్లి సర్పంచ్ పోలవేణి తిరుపతి మాట్లాడుతూ... మన చుట్టూ ఉన్న పరిసరాలే మన ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని, అందుకే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్ల పరిసరాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉన్న నీటిని వెంటనే పారబోయాలని సూచించారు. అపరిశుభ్ర వాతావరణం, నిల్వ ఉన్న నీరు దోమలకు ఆవాసాలుగా మారతాయని.. వాటి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతకమైన జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ఎవరికైనా జ్వరం వచ్చినట్లు అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే ఆసుపత్రికి వెళ్లి సరైన చికిత్స తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, బ్లీడింగ్ చెక్కర్ కిరణ్, ఆశా వర్కర్ కవిత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అమీనాబాద్‌లో ప్రపంచ పత్తి దినోత్సవ వేడుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ పత్తి దినోత్సవం ప్రాముఖ్యత, పత్తి రైతుల పాత్ర, పత్తి పంటలలో మెళుకువల గురించి పత్తి నాణ్యతను మెరుగుపరచడం, స్థిరమైన పత్తి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. అలాగే సమగ్ర సస్యరక్షణ, నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిపిఎఫ్ సంస్థ బిసిఐ ప్రాజెక్టు మేనేజర్ ఉదయ్ కిరణ్, జిన్నర్ రాజిరెడ్డి, ఏఈఓ కిరణ్మయి, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు సంతోష్, తిరుపతి, సందీప్, రాజు, రమేష్, గణేష్, శివరాజ్, కుమారస్వామి, శృతి, ప్రియాంక, అమీనాబాద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన చందుపట్ల కీర్తి రెడ్డి



**శాయంపేట ,అక్టోబర్ 8 (జనం సాక్షి)** శాయంపేట మండలం గట్లకనపర్తి గ్రామంలో ఇటీవల మృతి చెందిన నాతి కల్పన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగుల రమణారెడ్డి, గిద్దమారి సురేష్, వనం దేవరాజ్, కొడపాక సంజీవరావు, మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడిగా కాసాని రాజు



**దేవరుప్పుల, అక్టోబర్ 08 (జనం సాక్షి):**సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ దేవరుప్పుల మండల అధ్యక్షుడిగా పెద్దమడూర్ గ్రామానికి చెందిన కాసాని రాజును నియమించారు. కమిటీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్ దాస్ ఉపేందర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, జనగామ జిల్లా అధ్యక్షులు జావీద్ పాషా సహకారంతో ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. మండలంలో సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాసాని రాజు పేర్కొన్నారు.

## విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అధ్యక్షునిగా కేసోజు రమేష్



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 08 ( జనం సాక్షి )** : స్టేషన్ ఘన్ పూర్ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ కమిటీ అధ్యక్షునిగా కేసోజు రమేష్‌ని ఎన్నుకోవడం జరిగింది. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో విశ్వ కర్మ విశ్వ బ్రాహ్మణ మండల గౌరవ అధ్యక్షుడు ఉమా శంకర్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. విశ్వకర్మ విశ్వబ్రాహ్మ ణ పట్టణ అధ్యక్షునిగా కేసోజు రమేష్‌ని, కార్యవ ర్గ సభ్యులుగా మారేడుపాక మోహన్, మొగుదుం పురం కిషోర్, కేశోజు చంద్ర మోహన్, చెక్కపల్లి రాజు, శ్రీను, రుక్మాచారి, భీష్మ చారి, శ్రీకాంత్, ఉపేందర్, లక్ష్మీనారాయణ, రాజు, కుమార్, సతీష్, రాజు, మహేష్, గణేష్, వెంకటేష్, శంకర్, సతీష్, అనిల్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

### పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 8 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలం పెద్దాపురం హైస్కూల్ నందు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను ప్రారంభించిందని తెలిపారు.విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఏలుకటి రవి, చౌల్లపల్లి మాజీ సర్పంచ్ కుమారస్వామి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కక్కెర్ల రాజు గౌడ్, మార్కా రజనీకర్ గౌడ్, ఏఈ బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

## మీ ప్రమాణం యాప్ ద్వారా ఉద్యోగుల హాజరు నమోదు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి






**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 08(జనంసాక్షి).** ప్రభుత్వ ఉద్యోగుల సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా అధికారులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో 'మీ ప్రమాణం' యాప్ వినియోగంపై వివిధ శాఖల నోడల్ అధికారులు, ఉద్యోగులకు జిల్లా అదనపు కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్‌లో నమోదు, వినియోగించే విధానం, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత సమర్థంగా ప్రజలకు అందించేందుకు ఉద్యోగుల సమయపాలన కీలకమని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల వివరాల నమోదును సంబంధిత శాఖల నోడల్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ చరవాణిలోని 'మీ ప్రమాణం' యాప్ ద్వారా ముఖగుర్తింపుతో హాజరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యోగి గుర్తింపుతో పాటు హాజరు నమోదు చేసే ప్రదేశాన్ని ధ్రువీకరించే సదుపాయం ఈ యాప్‌లో ఉందని వివరించారు. కార్యాలయానికి వచ్చినప్పుడు, విధులు ముగించుకుని వెళ్లేటప్పుడు నిర్దేశిత విధానం ప్రకారం హాజరు నమోదు చేయాలని సూచించారు. ముఖగుర్తింపు, కార్యాలయ స్థాన నిర్ధారణ ద్వారా ఇతరుల తరఫున హాజరు నమోదు చేయడాన్ని నివారించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. శాఖాధిపతులు తమ పరిధిలోని ఉద్యోగుల హాజరు వివరాలను పర్యవేక్షించేందుకు, హాజరు నివేదికలను పరిశీలించేందుకు యాప్‌లో సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. యాప్‌లో ఉద్యోగుల పేర్లు, ఉద్యోగ గుర్తింపు సంఖ్యలు, శాఖ, హోదా, చరవాణి సంఖ్య తదితర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. నమోదు, ముఖగుర్తింపు, హాజరు నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం 'మీ ప్రమాణం' యాప్ జిల్లా నోడల్ అధికారి, ఈడీఎం దేవేందర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక బృందం ప్రతినిధులు యాప్‌లో నమోదు చేసుకునే విధానం, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు, కార్యాలయ స్థాన నిర్ధారణ తదితర అంశాలను వివరించి ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్, 'మీ ప్రమాణం' యాప్ నోడల్ అధికారి ఈడీఎం దేవేందర్, హైదరాబాద్ సాంకేతిక బృందం ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిలదీతల మధ్య కొనసాగిన లింగగిరి జిపి సమావేశం

### ఉప సర్పంచ్ లేకుండా జిపి నిధులు డ్రా చేస్తున్నారని విద్యుత్ మోటార్ సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపణ



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** లింగగిరి గ్రామపంచాయతీ జనరల్ బాడీ సమావేశం నిలదీతల మధ్య కొనసాగింది. గురువారం మండలంలోని లింగగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ జనరల్ బాడీ సమావేశం గ్రామ సర్పంచ్ మెడబోయిన రజితకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ఉప సర్పంచ్ సప్పిడి ప్రియాంక గత ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలలుగా సమావేశానికి రావడం లేదన్నారు. ఉప సర్పంచ్ ప్రియాంక సమావేశానికి రాకుండా హైదరాబాద్ లో నివాసం ఉంటున్నా నోట్ ఫైల్ పై ఆమె సంతకాలను పెడుతూ జీపీ నిధులను డ్రా చేస్తున్నారని వార్డు సభ్యులు నిలదీశారు. ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీంతో గ్రామ సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్ హైదరాబాద్ కు వెళ్లి ఉప సర్పంచ్ ప్రియాంక సంతకాలను చేయించుకుని వచ్చానని ఆమె సెల్ ఫోన్ కు వెళ్లిన ఓటిపి ఆధారంగానే ఎంబి రికార్డుల ప్రకారం జీపి నిధులను డ్రా చేసుకున్నట్లు సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్ తెలిపారు. అలాగే ఎస్సీ కాలనీలో ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి బావి విద్యుత్ మోటార్ ను అదే గ్రామానికి చెందిన మాదారపు నరసయ్య గత రెండు నెలలుగా తన సొంత వ్యవసాయ బావి వద్ద వాడుకుంటున్నాడని ఆరోపించారు.ఆ విద్యుత్ మోటార్ ను గ్రామపంచాయతీకి అప్పగించాలని గత నెల సమావేశంలో చెప్పినా కూడా ఇప్పటివరకు ఆ విద్యుత్ మోటార్ ను గ్రామపంచాయతీలో తెచ్చిపెట్టలేదని తన సొంత వ్యవసాయ బావి వద్ద నుండి తీసుకువచ్చి ఇంట్లో పెట్టుకున్నాడని పలువురు వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి బావికి గ్రామ సర్పంచ్ మెడబోయిన రజిత కుమార్ నూతన విద్యుత్ మోటార్ ను ఏర్పాటు చేసి కాలనీవాసులకు త్రాగునీటిని అందిస్తున్నారన్నారు. వెంటనే మాదారపు నరసయ్య వద్ద ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన విద్యుత్ మోటార్ ను గ్రామపంచాయతీలో తెచ్చిపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సర్పంచ్ రజిత కుమార్ శుక్రవారం ఉదయం 10 గంటల వరకు గ్రామపంచాయతీలో విద్యుత్ మోటార్ ఉంటుందని సమాధానం చెప్పారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లం సాగర్, తాడెం ప్రభాకర్, మాదారపు నరసింహులు, కర్కాల అఖిల్, పులి కవిత, పెరుమాండ్ల సునీత, కాయితోజు హైమ, కడగండ్ల ఎల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యాంప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేయూ వాలీబాల్ విజేత గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ములుగు విద్యార్థులకు అభినందన




**ములుగు,అక్టోబర్ 08(జనంసాక్షి).** ఈనెల 5,6, 7 తేదీలలో కిడ్స్ కాలేజ్ వరంగల్ లో జరిగిన కాకతీయ యూనివర్సిటీ లెవెల్ గేమ్స్ వాలీబాల్ లో ములుగు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె మల్లేశం మరియు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె సోమన్న తెలియజేశారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యాపకులు శాలువులతో సత్కరించారు ముందు ముందు ఇంకా విజయాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, శ్యామ్, శివకుమార్, నిఖిల్, సంతోష్, విష్ణు, ఉదయ్ కుమార్, వివేక్, అన్వేష్ లను ఘనంగా సత్కరించారు. వారితో పాటు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె సోమన్నను మరియు యూనిఫామ్ డోనర్ పోలబోయిన సాంబలక్ష్మి లను శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల గేమ్స్ కమిటీ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు వారిని అభినందించారు.

## యథేచ్ఛగా కోనసాగుతున్న ఇసుక దందా అడ్డుకునే నాథుడే లేడని స్థానికుల వాపోత



**సారంగాపూర్, అక్టోబర్ 8 (జనం సాక్షి)** మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని, దీనిని అడ్డుకునే అధికారులు కరువయ్యారని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మండల పరిధిలోని స్వర్ణ వాగు పరివాహక ప్రాంతంలో సహజ వనరుల దోపిడీ దందా విచ్చలవిడిగా పెరిగిపోయిందని, దీనిని అడ్డుకునే నాథుడే లేకుండా పోయాడని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ అక్రమ రవాణా జోరుగా సాగుతోందని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని ఆలూరు, బోరిగం, యాకరపల్లి, సారంగాపూర్, వంజర్, బీరవెల్లి, కంకెటా, ధోనిగాం, తాండ్ర గ్రామాల్లోని స్వర్ణ వాగు పరివాహక ప్రాంతం నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా జోరుగా అక్రమ ఇసుక రవాణా దందా కొనసాగుతోంది. కాసులకు కక్కుర్తి పడి ఈ అక్రమ దందా రోజురోజుకూ పెరిగిపోతోందని సమాచారం. ఈ దందాతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టపగలే సహజ వనరులను దోచుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. ఎక్కువగా రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పొలాల్లో ఇసుకను డంపింగ్ చేసి, టిప్పర్ల ద్వారా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు భావిస్తున్నారు. పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నిస్తే, అధికారుల అండదండలు ఉన్నాయని, ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి అంటూ ఎదురుదాడికి దిగుతున్న సందర్భాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

# ఓట్ల తొలగింపును వెంటనే నిలుపుదల చేయాలి

### రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**మంగపేట, అక్టోబర్ 08 (జనంసాక్షి)** మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శాంతియుతంగా నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... దేశ ప్రజల హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ఒక వజ్రాయుధం లాంటిదని, అటువంటి హక్కును తొలగిస్తూ బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘాన్ని అడ్డంపెట్టుకుని ఫాసిస్ట్ పాలన సాగిస్తున్నారని, ఈసీఈ అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, మాసిరెడ్డి వెంకటరెడ్డి, చాదా మల్లయ్య, బసారికారి హరికృష్ణ, తాతినేని హరికృష్ణ, మల్లూరు దేవస్థానం మాజీ చైర్మన్ యర్రంగారి సురేష్, ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమరం బాలన్న, ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాయం అనిత, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో క్షయ వ్యాధి నిర్మూలనకు గ్రామ సర్పంచుల పాత్ర ముఖ్యం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు



**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 08(జనంసాక్షి).** ఐడిఓసిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో జోష్ కమిటీల ప్రారంభోత్సవ దినం సందర్భంగా ఏర్పాటుచేసిన మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఈ జోష్ కమిటీల ఏర్పాటు భారతదేశంలో 55 జిల్లాలు గుర్తించగా అందులో ములుగు జిల్లా ఉండడం హర్షం వ్యక్తం చేస్తూ, చేవ్యాధి బారిన పడిన వ్యక్తులు మరియు కుటుంబాలు ఆరోగ్యవంతమైన గౌరవప్రదమైన జీవితాలను గడపడానికి మనమందరం కృషి చేయాలని, మనమందరం కలిసి కృషి చేస్తే "టీబి హారేగా- దేశ్ జీతేగా" జరుగుతుందని, గ్రామాలలో క్షయ వ్యాధి నిర్మూలన సిబ్బందితో, డిజిటల్ మొబైల్ ఎక్స్రే మిషన్ల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నామని, క్షయ వ్యాధిని తొందరగా గుర్తించి- తొందరగా చికిత్సను ప్రారంభిస్తే, క్షయ వ్యాధి వ్యాప్తి అరికట్టవచ్చునని, గుర్తించిన క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వము వారి బ్యాంకు ఖాతాలో వెయ్యి రూపాయలు(1000) పోషకార నిమిత్తమై అందిస్తుందని తెలిపారు. అటు తరువాత జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, జిల్లాలో మరియు మండలాల వారీగా క్షయ వ్యాధి నిర్మూలనకు' జోష్- కమిటీలను' ఏర్పాటు చేస్తున్నామని, ఈ కమిటీల ద్వారా టీబి ముక్తా భారత్ కార్యక్రమము గ్రామాలలో, మండలాలలో మరియు జిల్లా వ్యాప్తంగా ఏ విధంగా జరుగుతుందని పర్యవేక్షణ తో పాటు, వ్యాధిగ్రస్తులకు చికిత్స అందే విధము, గ్రామాలలో స్క్రీనింగ్ నిర్వహణ మరియు అవగాహన కల్పించడం లాంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి టీబి వ్యాప్తి అరికట్టడంలో దోహదపడుతుందని, అలాగే గ్రామాలలో మరియు మండలాలలో నిర్వహించే గ్రామ సభలో టీబీ వ్యాధి గురించి అవగాహన కల్పించాలని వివరించారు. తదనంతరం జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవితేజ మాట్లాడుతూ, ములుగు జిల్లాలో ఇప్పటివరకు 3784 టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, వీటిలో 396 కొత్త క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించామని, వీరికి వెంటనే చికిత్సను అందిస్తున్నామని , టిబి నియంత్రణ కార్యక్రమంలో నిరంతర కృషి సల్పిన 11 గ్రామ సర్పంచులకు గుర్తించి, వారినీ సన్మానిస్తున్నామని, అలాగే టిబి చికిత్సను క్రమం తప్పకుండా తీసుకొని టీబి నయం చేసుకున్న ఇద్దరినీ "టీబి -చాంపియన్గా" గుర్తించి, వారిని కూడా సన్మానం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, టీబి నియంత్రణ సిబ్బంది మరియు జిల్లా కార్యాలయ సిబ్బంది టీబి-ముక్తా భారత్ నిర్మూలనకై ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ఎంపిహెచ్ఓ సురేష్ బాబు, సమ్మయ్య, టిబి నియంత్రణ కార్యక్రమ కో-ఆర్డినేటర్ రమేష్, టిబి నియంత్రణ సిబ్బంది మరియు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# సీబీఎస్‌లో దసరా ధమాకా సేల్



**నిర్మల్ టౌన్ , అక్టోబర్ 8:(జనంసాక్షి )** నిర్మల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీబీఎస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) షోరూంలో దసరా ధమాకా సేల్ గురువారం ప్రారంభమైంది. సినీనటులు మణెమ్మ, గాయత్రి, జబర్దస్త్ టీమ్ సభ్యులు, హైపర్ ఆది సందడి చేశారు. ఈ సందర్భంగా మణెమ్మ, గాయత్రి మాట్లాడుతూ నిర్మల్‌లో సీబీఎస్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీబీఎస్‌లో విభిన్న డిజైన్లు, నాణ్యమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో కొనసాగుతున్న తమ సంస్థను తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ ప్రజల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవం సందర్భంగా షోరూంకు భారీగా కస్టమర్లు తరలివచ్చారు. మహిళలు చీరలు, ఇతర వస్త్రాలను కొనుగోలు చేయడంతో షోరూం సందడిగా మారింది.

## జన్నారం కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో వన్యప్రాణి వారోత్సవాలు



**జన్నారం, అక్టోబర్ 08 (జన్నం సాక్షి):** వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని అటవీ శాఖ మరియు హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జన్నారం మండల కేంద్రంలో విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి హైస్కూల్ మరియు రాఘవేంద్ర హైస్కూల్‌కు చెందిన దాదాపు 280 మంది విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వన్యప్రాణుల రక్షణ, అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఖాదర్ వలీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మమత, సెక్షన్ ఆఫీసర్లు శంకర్, శివకుమార్, బీట్ ఆఫీసర్ రవి నాయక్, అటవీ శాఖ రేంజ్ సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు మరియు వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి

### ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా



**మావల అక్టోబర్ 09 ( జనం సాక్షి):** జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్. ఐ. ఆర్) ప్రక్రియను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా, జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో ఏర్పాటు చేసిన సవరణ కేంద్రాన్ని వారు సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో సమావేశమైన యోగితా రాణా, ఓటర్ల నమోదు, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. కొత్తగా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు అబ్యాస పాఠశాల విద్యార్థి



**బెల్లంపల్లి, అక్టోబర్ 8, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలోని అభ్యాస స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న కొండి సాయిచరణ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన 60 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. సాయిచరణ్ ఈ ఘనత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నస్రీన్, పీఈటీ సంధ్య, పాఠశాల యాజమాన్యం సాయిచరణ్‌ను ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాయిచరణ్ క్రీడల్లో ప్రతిభ చూపడం చాలా సంతోషకరం. ఆసిఫాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పాఠశాలకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సాయిచరణ్‌ను ఈ స్థాయికి తీర్చిదిద్దిన పీఈటీ సంధ్య కృషిని యాజమాన్యం అభినందించింది.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ 'బ్లాక్ డే'




**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 08,(జనంసాక్షి ):** ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట 'బ్లాక్ డే' నిరసన, నిరాహార దీక్ష నిర్వహించారు. ఇండియా కూటమి ఇచ్చిన 'సేవ్ డెమోక్రసీ' పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను పాటించాలని, ప్రజల ఓటు హక్కును కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఖండించారు. ఓటు హక్కు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

### రాష్ట్ర అవార్డు గ్రహీత డాక్టర్ ఉమేశ్ గుప్తాకు ఘన సత్కారం



నిర్మల్ టౌన్ : **అక్టోబర్ 08,(జనంసాక్షి )** నిర్మల్ పట్టణంలోని స్థానిక పెన్షన్ భవన్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీడబ్ల్యూఓ అధికారి వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వృద్ధాప్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారి సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. వయోవృద్ధుల పట్ల సమాజం సేవాభావంతో వ్యవహరించాలని పలువురు సూచించారు. సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఇటీవల రాష్ట్ర అవార్డు అందుకున్న డాక్టర్ ఉమేశ్ గుప్తాను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన అందిస్తున్న సామాజిక, ఆరోగ్య సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వయోవృద్ధులు, సామాజిక సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులపై దాడి చేసిన అటవీశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి




**బెల్లంపల్లి, అక్టోబర్ 8, (జనంసాక్షి)** కోటపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గిరిజన రైతులపై అటవీశాఖ దాడులు చేయడం, తీవ్రంగా కొట్టడం, కులం పేరుతో దూషించడం, మనోభావాలను దెబ్బతీయడం, హక్కులకు భంగం కలిగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం తిరుపతి బెల్లంపల్లి ఐఎఫ్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజనులపై అటవీశాఖ అధికారులు కిరాతకంగా దాడులు చేసి కొట్టారని, పంట ధ్వంసం చేయడం, కులం పేరుతో దూషించడం అత్యంత దారుణమని అన్నారు. గిరిజనులు పట్టు పురుగుల పెంపకం సాగు చేస్తూ జీవనోపాధిని చేసుకుంటున్నారని, అటవీ అధికారులు వారి హక్కులను, జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని అన్నారు. ఆదివాసీలు జీవించడానికి ఏమాత్రం హక్కు లేదా అని ప్రశ్నించారు. బాధ్యులపై ప్రభుత్వం తక్షణమే న్యాయ విచారణ జరిపించి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ రైతు చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కోమాలో ఉన్నాడని, ఆదివాసీ గిరిజనులపై, గిరిజనేతరులపై, అటవీశాఖ బరితెగింపుగా అత్యంత కిరాతకంగా దాడులు చేస్తే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. అటవీశాఖ అధికారులు భవిష్యత్తులో ఎలాంటి దాడులు జరిపినా ఆ దాడులకు కొమరం భీం సాక్షిగా ఆదివాసీ గిరిజన బిడ్డలు ప్రతి దాడులు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరుణ్ , వంశి, పవన్, వరుణ్, లింగయ్య, మల్లేష్, రాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో విఫలం

### డీసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క. నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నిరసన. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08(జనంసాక్షి ):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాపాడటంలో విఫలమవుతోందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం గురువారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్,కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సుగుణక్క అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ దేశంలో ఓటు చోరీకి తావులేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని అన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చూడాలని, ఎవరి ఓటు హక్కు అన్యాయంగా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నాయకులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ఎన్నికల వ్యవస్థకు ఉందన్నారు. ఇటీవల ఢిల్లీలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు వెళ్లిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కుపై ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు. "ఓటు చోరీ ఆపాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అని సుగుణక్క అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులను కాపాడటం అందరి బాధ్యత అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా పారదర్శక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సుగుణక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తారీక్, మండల అధ్యక్షుడు మురళి, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, వాంకిడి మండల అధ్యక్షుడు మంగాజి, కెరమెరి మండల అధ్యక్షుడు సుజాహిద్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల జక్కయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ గడ్డల సత్తయ్య, సీనియర్ నాయకులు చిట్ల నారాయణ, బాలు యాదవ్, మహమ్మద్, విశ్వనాథ్, శంకర్, పేంటు, మహిళా నాయకురాలు కళావతి, యువజన కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, ఎలాగల, నైతంబాను పాల్గొన్నారు.

## కెజిబివి అతిథి ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్





**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08(జనంసాక్షి ):** జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలో నిర్వహించిన ప్రతిని ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అతిథి ఉపాధ్యాయుల ఎంపికలో అభ్యర్థుల బోధనా నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్కు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హత కలిగిన అభ్యర్థులను పూర్తిగా పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులు ప్రదర్శించిన బోధనా తీరును స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం లభిస్తుందని తెలిపారు. అభ్యర్థులు దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, అతిథి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, పాఠశాల, పల్లె దవాఖానల్లో పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మిక తనిఖీలు







**ఏటూరునాగారం అక్టోబర్ 08(జనంసాక్షి).** మండలంలో ప్రజలకు అందుతున్న విద్య, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా పలు ప్రభుత్వ సంస్థలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రం, జీపీ పాఠశాల, ఏటూరునాగారం సబ్ సెంటర్--1 (పల్లె దవాఖాన), సబ్ సెంటర్ -2లను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం పరిశీలన ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీఓ, చిన్నారుల హాజరు, రికార్డులు, అభ్యసన సామగ్రి, పోషకాహారం మరియు కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, బోధనా సామగ్రిని సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు. జీపీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనంపై పరిశీలన ఆకులవారి ఘనపూర్ జీపీ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన పీఓ, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన సామగ్రిని పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్లె దవాఖాన, సబ్ సెంటర్లలో వైద్య సేవల తనిఖీ ఏటూరునాగారం సబ్ సెంటర్--1 (పల్లె దవాఖాన), సబ్ సెంటర్--2లను తనిఖీ చేసిన పీఓ, అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, రోగుల వివరాల నమోదు, ఇతర రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందుతున్న సేవలు, అవసరమైన మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య పరికరాలు, ఓపీ సేవలు, రికార్డుల నిర్వహణను కూడా పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమయానుకూలంగా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు.

## రేపు జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఈయు కూటమిని గెలిపించండి

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, (ఈ యు) మహబూబాద్ డిపో గౌరవ అధ్యక్షులు బి అజయ్ సారధి పిలుపు



**తొర్రూరు , అక్టోబర్ 08 (జనం సాక్షి):** రేపు అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించాలని ఆర్టీసీ సంస్థలు కాపాడాలని కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి అజయ్ సారధి రెడ్డి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుకు రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుకు ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో తమ ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలియజేస్తూ ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేశామని ఎన్నో కేసులు కూడా పెట్టబడ్డాయని అన్నారు ఈ సందర్భంగా గుర్తింపు ఎన్నికల్లో బస్సు గుర్తు మరియు కాగడా గుర్తులను గెలిపించాలని కోరారు పెండింగ్లో ఉన్న డిఏలు పిఆర్సి బకాయిలు విడుదల కోసం ఎంప్లాయిస్ యూనియన్ కూటమినే గెలిపించాలని కోరారు ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపు ద్వారానే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు విలీన ప్రక్రియను అడ్డుకునేందుకు అధికార పార్టీ కొన్ని సంఘాలకు మద్దతు తెలుపుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేందుకు ఎంప్లాయిస్ యూనియన్‌ని గెలిపించాలని కోరారు మహిళా కండక్టర్లకు డ్రైవర్లకు ప్రత్యేక గదులు డిపోల వద్ద ఏర్పాటు చేయడమే ఈయూ కూటమి దయమన్నారు నేడు ఆర్టీసీ ఎన్నికలు జరుగుతున్నాయి అంటే అది ఎంప్లాయిస్ యూనియన్ పోరాటమే అన్నారు అశ్వద్ధామ రెడ్డి తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసమే జేఏసీని రెండుగా చీల్చి కార్మికులను విడగొట్టాడని తెలిపారు కార్మికులను ఏకం చేయడానికి ఎన్ఎంయు సహకరించిందని తెలిపారు ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థలు కాపాడడానికి ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఎంప్లాయిస్ యూనియన్ కు ఓటు వేయడం ద్వారా ఇవన్నీ సాధ్యమవుతాయని విజ్ఞత గల ఆర్టీసీ కార్మికుల ఓటర్లు ఆలోచించి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుపై రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుపై తమ యొక్క అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించవలసిందిగా బి అజయ్ సారధి రెడ్డి కోరారు . ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ కుమార్, సిపిఐ తొర్రూర్ మండల కార్యదర్శి బందు మహేందర్, ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్ పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, ఏఐవైఎఫ్ నాయకులు పేరబోయిన క్రాంతికుమార్. తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ వెంకటేశ్వర్లు



**మహదేవపూర్: అక్టోబర్ 8 (జనంసాక్షి):** శనివారం రోజున ప్రారంభంకానున్న బతుకమ్మ పండుగను ప్రజలంతా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తమ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం సీఐ వెంకటేశ్వర్లు తమ ప్రకటనలు పేర్కొన్న బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని బతుకమ్మ పండుగ ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండానిర్వహించేందుకు నిర్వాహకులు మరియు ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటించాలని సీఐ సూచించారు. అదేవిధంగా బతుకమ్మ కార్యక్రమ నిర్వాహకులు బతుకమ్మ కార్యక్రమానికి ముందుగా పోలీస్ స్టేషన్కు సమాచారం అందించి అవసరమైన అనుమతులు సూచనలు తీసుకోవాలని రహదారుల కూడలిలో రాకపోకలకు అంతరాయం కలిగించకూడదని కార్యక్రమ ప్రదేశాలలో మద్యం సేవించి అల్లర్లు చేయడం గొడవలు పడడం అసభ్యకర ప్రవర్తనలకు పాల్పడడం వంటి వాటిని హనుమతించరాదు. డీజేలు సౌండ్ సిస్టం వినియోగములో పోలీసులు సూచనలు పాటించాలని బాణసంచా వినియోగిస్తే తగిన భద్రత చర్యలు తీసుకోవాలని ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినచో పోలీసులకు సమాచారం అందించాలని అత్యవసర పరిస్థితులు ఏర్పడిన వెంటనే డయల్ 112 కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

## పాస్‌పోర్ట్‌లో తప్పుల సవరణకు నోటరీ అఫిడవిట్




**బెల్లంపల్లి, అక్టోబర్ 8 (జనం సాక్షి)** బెల్లంపల్లి: పాస్‌పోర్ట్‌లో నమోదైన పేర్లలో తప్పులను సరిచేయాలని కోరుతూ బెల్లంపల్లికి చెందిన మహమ్మద్ సిరాజ్ ప్రభుత్వ నోటరీ ద్వారా అఫిడవిట్ నమోదు చేయించారు. తన పాస్‌పోర్ట్ నంబర్ 19901622, తేదీ 08-07-2014 కాగా, అందులో తన పేరు మహమ్మద్ సిరాజ్కు బదులుగా మహమ్మద్ సెరాజ్గా తప్పుగా నమోదు చేశారని తెలిపారు. తన తండ్రి పేరు మహమ్మద్ ఫకీర్, వయస్సు 47 సంవత్సరాలు, వృత్తి ప్రైవేట్ ఉద్యోగం అని, బెల్లంపల్లి బాబుకాంప్ బస్తీలోని ఇంటి నంబర్ 13-4-19/3/ఏ/1లో నివాసం ఉంటున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య ఆధార్ కార్డు ప్రకారం ఆమె పేరు ఫాహిమా అని, అయితే తన పాస్‌పోర్ట్‌లో ఆమె పేరు కూడా తప్పుగా మహమ్మద్ ఫకీర్గా నమోదైందని తెలిపారు. పాస్‌పోర్ట్‌లో నమోదైన ఈ తప్పులను సంబంధిత అధికారులు పరిశీలించి, సరైన వివరాలతో సరిచేయాలని మహమ్మద్ సిరాజ్ కోరారు. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలన్నీ వాస్తవమేనని పేర్కొంటూ ప్రభుత్వ నోటరీ సమక్షంలో అఫిడవిట్‌ను నమోదు చేయించారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 15 వేల బోనస్ అందించాలి

### సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్




**శ్రీరాంపూర్( జనంసాక్షి):** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 15 వేల బోనస్ అందించాలని, కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు చవ్వా మహేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు పర్మినెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తగిన వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా 7వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ సిబ్బందికి రక్షణ పరికరాలు, కాంట్రాక్టు కార్మికులందరికీ వైద్య సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను అర్హులైన కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు పోన్నమనేని వేణుగోపాల్‌రావు, మిట్టపల్లి మొగిలి, కలవెన స్వామి, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి రాంపల్లి గోపాలచారి, మర్రి రాజగోపాల్, ఇందూరి నరేష్, కుంటాల రాజు, బొమ్మకంటి కిషన్, దుంపల శ్రీధర్, కొమ్మ బాపు, కుంట రాజు ,కుమ్మరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

### మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



**నేరడిగొండ అక్టోబర్8 (జనంసాక్షి):** మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన సోయం గంగాధర్ టీచర్ కుమారుడు సోయం ఆషిస్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ,బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు. ఆషిస్ మృతి విషయం తెలుసుకున్న రాథోడ్ బాపురావు గురువారం మాదాపూర్ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఆషిస్ మృతికి గల పరిస్థితులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. చిన్న వయసులోనే ఆషిస్ మృతి చెందడం తీవ్రంగా బాధాకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రజల కష్టసుఖాల్లో టీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటుందని, కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని రాథోడ్ బాపురావు హామీ ఇచ్చారు. వారి వెంట టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గ్రామస్థులు రాథోడ్ బాపురావు వెంట ఉండి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో రోడ్లు ప్రారంభం

### బాలన్నగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**మంగపేట, అక్టోబర్ 08( జనంసాక్షి)** మండలంలోని ఎస్టి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 6.80 కోట్ల ఎస్టి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో మండల వ్యాప్తంగా ఉన్న ఎస్టీ గ్రామాలలో అంతర్గత సిసి రోడ్ నిర్మాణ పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య తో కలిసి సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ.. మంగపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఏ ఒక్క అంతర్గత సీసీ రోడ్డు గానీ, డ్రైనేజీ గానీ లేకుండా చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం బాగుపడుతుందని ఆయన అన్నారు. మండలానికి అన్ని శాఖల ద్వారా అత్యధిక నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, మాజీ సర్పంచ్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 08 ( జనం సాక్షి ) :** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ( ఎన్ఎంఎన్ ఎఫ్ )లో భాగంగా మండలంలోని కొత్తపెల్లి పరిధిలోని పొలాలను సందర్శించి, అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ఎస్ కరుణాకర్ అవగాహన కల్పించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంలో సహజ వనరులతో తయారు చేసే ఎరువులు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించారు. రసాయనిక పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆహార ధాన్యాల్లో పురుగుమందుల అవశేష ప్రభావాన్ని తగ్గించి, సురక్షితమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని ఎంఏఓ కర్ణాకర్ వివరించారు.అలాగే ఎన్ఎంఎన్ ఎఫ్ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలంలో వర్మీ కంపోస్ట్‌ను వినియోగించి, నేల సారాన్ని పెంపొం దించడంతో పాటు పంటకు అవసరమైన పోషకా లను సహజపద్ధతుల్లో అందించవచ్చని రైతులకు ప్రదర్శన ద్వారా వివరించారు. జనగామ జిల్లా ఎన్ఎంఎన్ఎఫ్ కోఆర్డినేటర్ హరీష్ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించా రు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి గ్రామ సర్పంచ్ ముక్కెర స్వరూప రవి, ఏఈఓ బి శ్రావణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చేత అవార్డు అందుకున్న సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్

### టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా ఫతేపూర్ ఎంపిక



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 09 ( జనం సాక్షి ) :** క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనలో విశేషంగా కృషి చేసి, టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా ఫతేపూర్ గ్రామం ఎంపిక అయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జనగా మ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా ఫతేపూర్ గ్రామ సర్పంచ్ గుగు లోతు లక్ష్మీ ఉమ్లా నాయక్ ప్రతిష్ఠాత్మక అవార్డు ను అందుకున్నారు. టీబీ రహిత గ్రామంగా ఫతేపూర్ ఎంపిక కావడంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది,ఇతర సంబం ధిత శాఖల సిబ్బంది, గ్రామ ప్రజల సమష్టి కృషి కీలకంగా నిలిచింది.ఈఅవార్డు గ్రామ పంచాయతీ చేసిన కృషికి గుర్తింపుగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో టీబీ రహిత సమాజ నిర్మాణం, ప్రజారోగ్య పరిరక్షణ గ్రామ అభివృద్ధి కోసం పనిచేయడానికి ప్రేరణగా నిలు స్తుందని సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్ తెలిపారు.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రతి ఒక్కరు చేసుకోవాలని మండల బిఆర్ఎస్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య



**పెద్దవంగర అక్టోబర్ 08(జనం సాక్షి )** ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని మండల బిఆర్ఎస్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో జరగబోయే ఎంఎల్సి ఎన్నికలకు మండల పార్టీ కార్యాలయంలో ఎంఎల్సి ఎన్రోల్మేంట్ (ఓటర్ నమోదు కేంద్రశీ)ను మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఏర్పాటు చేసిన కావున ఎంఎల్సి ఓటు గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తియై నేటికి 3 సంవత్సరాలు అయిన వారు ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ,మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల నాయకులు శ్రీరాం సుధీర్,దుంపల సమ్మయ్య,మాజీ సర్పంచ్లు చింతల భాస్కర్ భీమ్లా నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరుట్ల వెంకట్ రెడ్డి, తండల శోభన్, మాజీ ఎంపీటీసీ పూర్ణచందర్, వెంకన్న యూత్ నాయకులు మైలపాక అనిల్, బొల్లు సతీష్ ,దేశెట్టి మహేష్, నిమ్మల కార్తీక్, బొమ్మెర నాగేష్, తంగళ్ళపల్లి విక్రమ్, కట్కూరి నరేష్, బానోతు నరేష్, జాటోతు వెంకటేష్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



**పాలకుర్తి, అక్టోబరు 08(జనంసాక్షి)** మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ఎంపీడీవో వర్కల వేదవతి అధ్యక్షతన జరిగిన ఈ మండల సమావేశానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ సీఈవో బలరాం హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభలో చర్చ జరిగిన దాఖలాలు లేవని పలువురు సర్పంచులు వాపోయారు. ఈ సభలో ఎజెండా వారిగా ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు. ముఖ్యంగా వైద్య, విద్య, రవాణా, సహకారశాఖ. బీసీ కార్పోరేషన్, ఎస్సీ కార్పోరేషన్, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖల అధికారులు మండల సభకు దుమ్మాకొట్టారు. ఈ సందర్భంగా సీఈవో బలరాం మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి గ్రామాలభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో త్రాగు నీటికి ఎద్దడి ఏర్పడవచ్చని అన్నారు. అందుకు ప్రత్యామ్నా యంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, నీటి కుంటలను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతే కాకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సభలో మండల స్పెషల్ అధికారి మాధవిలత, తహసీల్దార్ సరస్వతీ, ఏఈలు మహేందర్, రణదీర్, రాకేష్, ప్రశాంతి, సీడీపీవో విజయచంద్రిక, సర్పంచులు యాకస్వామి, గద్దం కిరణ్, మహేందర్, స్వరూప, బుజ్జి, లోనె శ్రీనివాస్, చింతకింది అనిత, పోశాల వెంకన్న, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## టిబి ముక్త్ భారత్ కోసం యువత చురుకుగా భాగస్వాములు కావాలి

### ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 8(జనంసాక్షి):** టిబి ముక్త్ భారత్ సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకుగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు.గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన టిబి నిర్మూలనలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత కేసులను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని సూచించారు.టిబి ముక్త్ భారత్ -- ఆయుష్మాన్ కోసం జోష్ టీముల' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి అని, ప్రధానంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందని టిబి రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి కఫ పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకోవాలని తెలిపారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని పేర్కొన్నారు.

**డ్రగ్ రెసిస్టెంట్ టిబిపై అప్రమత్తత అవసరం**

డ్రగ్ రెసిస్టెంట్ టిబి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మందులను సక్రమంగా, నిర్దేశించిన కాలం పాటు తీసుకోకపోతే ఔషధ నిరోధకత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డ్రగ్ రెసిస్టెంట్ టిబి ఉన్నవారు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ చికిత్సను పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో టిబిపై అవగాహన కల్పించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడం, అవసరమైన పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చూడాలని సూచించారు.ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత, ప్రభావశీల వ్యక్తుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యశాఖతో పాటు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. **టిబి రహిత గ్రామాల సర్పంచులకు సన్మానం**టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించబడిన గ్రామాల సర్పంచులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సన్మానించారు. శాలువాలతో సత్కరించి టిబి ముక్త్ భారత్ గ్రామాల సర్టిఫికెట్లను అందజేశారు. చాపలబండ గ్రామ సర్పంచ్ ఆలేటి ప్రభ, దేశాయిపల్లి సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి, చెన్నారం సర్పంచ్ సింధం లలిత, కాశిగూడెం సర్పంచ్ పటాన్ రాజాక్, లోహిత గ్రామ సర్పంచ్ బొమ్మ నాగేష్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కు అనిత తరఫున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్ అందుకున్నారు. టిబి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా రాణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ. ప్రకాష్, డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ అరుణ్ జోషి, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, టిబి రహిత గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ కమాండర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు, టిబి విభాగ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కోనాపురం గ్రామంలో దొంగల బెడద...!

- విద్యుత్ మోటార్లు, వైర్లు, వాహనాల బ్యాటరీలు, టైర్లు, కటింగ్ మిషన్లు, గుడి గంట చోరీ
- వరుస దొంగతనాలతో భయాందోళనకు గురవుతున్న గ్రామస్తులు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి



**చెన్నారావుపేట, అక్టోబర్ 8( జనం సాక్షి):** మండలంలోని కోనాపురం గ్రామంలో దొంగల బెడద నెలకొంది. వరుస దొంగతనాలతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని స్మశాన వాటిక వద్ద ఉన్న బోరులోని విద్యుత్ మోటర్, పైపులు, విద్యుత్ వైరు సుమారు రూ. 20 వేల విలువైన వస్తు సామాగ్రిని గుర్తు తెలియని దొంగలు అపహరించుకు పోయారు. గత కొద్ది రోజుల క్రితం పెద్దమ్మ గుడి వద్ద ఉన్న విద్యుత్ మోటారు వస్తు సామాగ్రి రూ. 20 వేల విలువ చేసేవి అపహరించుకు పోయారు. అలాగే బీరన్న గుడి వద్ద ఉన్న విద్యుత్ మోటార్, ఇతర సామాగ్రి రూ.15 వేలు విలువ చేసేవి అపహరించుకు పోయారు. అదేవిధంగా కసివజ్జుల రమణాచారి ప్రధాన రహదారిలో వెల్డింగ్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన షాపు బయట ఉన్న రూ. 10వేల విలువ చేసే కటింగ్ మిషన్లు అపహరించుకు పోయారు. ముస్నూరు కాపు స్వర్గ రథం వాహనానికి సంబంధించిన 2 బ్యాటరీలు, 2 టైర్లు, గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టే స్టాండు, గుడి గంటను అపహరించుకు పోయారు. కోనాపురం గ్రామంలో గత కొద్దిరోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ సర్పంచ్ మైదం రాకేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి షాహెద్ పాషాలు గ్రామంలో వరుస దొంగతనాలు జరగడం మూలంగా గ్రామంలోని ప్రజలకు ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని వెంటనే పోలీసులు నిఘా పెట్టి గ్రామంలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ తిరిగి దొంగతనాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## టీబీ వ్యాధిని గుర్తించి పూర్తిగా నిర్మూలన చేసిన గ్రామపంచాయతీలుగా ఎన్నికైనందున సర్పంచ్‌లకు సన్మానం



**మహదేవపూర్: అక్టోబర్ 8 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎడపెల్లి, కుదురుపల్లి, గ్రామపంచాయతీలు టీబీ ముక్తి గ్రామపంచాయతీల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రజల సహకారముతో భూపాల్ పల్లి జిల్లా డిఎం అండ్ డిహెచ్ మధుసూదన్ నేతృత్వములో వైద్యుల సహకారముతో టీబీ కేసులను త్వరిత గతిన గుర్తించి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలన చేసి టిబి ఫ్రీ గ్రామపంచాయతీగా ఎన్నికైనందున గురువారం రోజున భూపాల్ పల్లిజిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి కార్యాలయంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జెడ్పిసిఓ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ . ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ సమక్షంలో కుదురుపల్లి సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి, ఎడపల్లి సర్పంచ్ మోతె నీలారాని సాంబయ్య లకు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్ రెడ్డి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని కలెక్టర్, మైన్స్ అధికారులకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



**టేకుమట్ల అక్టోబర్ 08 జనంసాక్షి** టేకుమట్ల మండలంలోని మానేరు, చలివాగు పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను తక్షణమే అడ్డుకోవాలని కోరుతూ టేకుమట్ల మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా మైన్స్ జియాలజీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ టేకుమట్ల మండలంలోని మానేరు, చలివాగు ప్రాంతాల నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను తరలిస్తున్నామనే పేరుతో భారీగా ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన ఇసుకను అక్రమంగా తరలిస్తే స్థానికంగా ఇసుక కొరత ఏర్పడటంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, అనుమతులు, రవాణా పర్మిట్లు, వాహనాల వివరాలను పరిశీలించాలని కోరారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, మానేరు, చలివాగు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రించాలని బీఆర్ఎస్ నాయకులు అధికారులను కోరారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన సహజ వనరులు అక్రమంగా తరలిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ముఖ్య నాయకులు బందెల నరేష్, పింగిలి వెంకటేశ్వర రెడ్డి, గుర్వాడి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ పసర అధ్యక్షురాలుగా బొజ్జా లక్ష్మి



**గోవిందరావుపేట అక్టోబర్08 (జనం సాక్షి ):** పసరా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బొజ్జలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండలంలోని పసర గ్రామంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చొప్పదండి వసంత. ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ మహిళా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ విచ్చేసి మహిళా కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని నియమించారు. అధ్యక్షురాలుగా బొజ్జ లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా భూక్య భద్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా రేపాక సంధ్య, కార్యదర్శిగా వంతల పూజ, కోశాధికారిగా నేతావత్ కమలమ్మ, సభ్యులుగా మిరియాల సమ్మక్క, సామ సమ్మక్క, కోడి పద్మ, పెద్దబోయిన మంగ, వణుకూరి చిన్ని, కోడి సమ్మక్క, సంపల్లి విజయ, వల్లం నాగేశ్వరమ్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సప్పిడి సంజన, మాజీ అధ్యక్షులు బద్దం లింగా రెడ్డి, గొంది కిరణ్, యాస పూలమ్మ, నర్ర సాంబ తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## చిట్టీల నిర్వహణపై విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ కార్యదర్శి టిఎల్. రవి

### ఆరోపణాలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి



**మంగపేట, అక్టోబర్08(జనంసాక్షి)** మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యాబోధనను పక్కనపెట్టి గిరిగిరి డబ్బుల వ్యాపారం, చిట్టీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని దీనిపై విద్యాశాఖ జిల్లా అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ, నిరుపేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ఉందన్నారు. కానీ కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల సమయాల్లోనూ, తమ ఉద్యోగ బాధ్యతలకు విరుద్ధంగా చిట్టీల నిర్వహణ వంటి ఆర్థిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే వార్తలు రావడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. పాఠశాల వేళల్లో ఇటువంటి అనధికారిక కార్యక్రమాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధ్యులైన ఉపాధ్యాయులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు అవాస్తవమని తేలితే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రజలముందుంచాలని ఆయన సూచించారు. ప్రభుత్వ బడులు నిరుపేద విద్యార్థులకు ప్రధాన విద్యానిలయాలని, ఉపాధ్యాయులు తమ పూర్తి సమయాన్ని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే కేటాయించేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ మరింత పెంచాలని టి.ఎల్. రవి విజ్ఞప్తి చేశారు.

## బంగారం చోరీ కేసులో నిందితుడు అరెస్టు




**పెద్దవంగర అక్టోబర్ 08(జనం సాక్షి )** బంగారం చోరీ ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం తొర్రూర్ డివిజన్ సీఐ గణేష్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం మండలంలో అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల పద్మ తన ఇద్దరు కూతుర్లను ఇంటివద్ద ఉంచి ఊరికి పోయింది. రాత్రి ఆ ఇద్దరు అమ్మాయిలు తమ బంధువుల ఇంట్లో పండుకుంటానికి పోయి గురువారం ఉదయం ఇంటికి రాగ వేసిన ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని 8 తులాల బంగారాన్ని అపహరించి పారిపోయినట్లు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. గురువారం నిందితుడిని పెద్దవంగరలో దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రమోద్ కుమార్, ఏఎస్సై రాజారాం, కానిస్టేబుల్ ఈర్య నాయక్, మహేందర్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట

- ఢిల్లీలో ప్రతిపక్ష నేతలపై పోలీసుల చర్యలను నిరసిస్తూ గూడూరులో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన



**గూడూరు,అక్టోబర్08(జనంసాక్షి):** న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న పోలీసుల చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడూరు మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ పిలుపు మేరకు, మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమా ఆదేశాలతో గూడూరులో ఆందోళన చేపట్టారు. గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాల నాయక్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వైపు శాంతియుతంగా మార్చ్ నిర్వహిస్తున్న ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులను అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని,నిరసన కార్యక్రమాలను అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. గూడూరు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టె వెంకన్న, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి, మట్టిమిట్ట సర్పంచ్ పూర్ణచందర్,జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ రసూల్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందిక శంకర్,చిన్న ఎల్లాపురం ఉపసర్పంచ్ వెంకటరామ్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలు నాయక్, మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నం వెంకన్న, కరీం, రాములు తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు సుందర్, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముత్యం లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పెండింగ్ కేసులపై సీరియస్ గడువులోగా పూర్తి చేయకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటా

జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. కమలాపురం,మండపాక,తాడ్వాయి, జవహర్‌నగర్ టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో 24/7 డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. లారీల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ లాక్,ఇసుక లారీల కారణంగా సంభవించే రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై టీఎస్ఎండీసీ ఉన్నతాధికారితో ఎస్పీ చర్చించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. స్థానిక ఎస్ఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లు,చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. నేర నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ఏటూరునాగారం ఏ ఎస్పీ మనన్ బట్ ఐపీఎస్ అదనపు ఎస్పీ సదానందం,ములుగు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రవీందర్,డిసిఆర్బి డీఎస్పీ కిషోర్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ ప్రతాప్,స్థానిక సీఐలు,ఆర్మడ్ రిజర్వుడ్ ఇన్స్పెక్టర్ లు,ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈర్య తండాలో పోషణ మాస ముగింపు

**చెన్నారావుపేట, అక్టోబర్ 8 (జనంసాక్షి):** మండలంలోని ఈర్య తండాలో పోషణ మాస ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఈర్య తండా అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోషణ విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మేడి సరోజన, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## సిద్ధార్థలో ముందస్తుగా బతకమ్మ వేడుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 8 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్లో ముందస్తుగా బతకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలను విద్యార్థులతో కలిసి సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డిలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పూర్వ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. భవిష్యత్తు తరాలకు మన సంప్రదాయాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ముదురు పద్మ, నామాల స్రుజన, కుండె రోజా రాణి. బొజ్జ స్వప్న, దివ్య జ్యోతి, రమాదేవి, స్రవంతి, జ్యోతి, రజిత, శైలజ, శ్రావణి, రోజా, సంధ్య, అఖిల, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక అక్షరాస్యత విభాగ సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం..

- జిల్లా విద్యాధికారి లలిత..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. లలిత తెలిపారు. ఇందులో భాగంగా తక్కువ తరగతుల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయుల నుండి నాలుగు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రధాన ప్రధానోపాధ్యాయుడు - 1, తెలుగు/ఉర్దూ నిపుణులు - 1, ఆంగ్ల నిపుణులు - 1, గణిత నిపుణులు - 1 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు పదేళ్ల సేవ, రెండేళ్ల పరిపాలనా అనుభవం, ఉపాధ్యాయులకు ఐదేళ్ల బోధనా అనుభవం ఉండాలని, బోధనా పద్ధతులు, శిక్షణ, వనరుల నిపుణులుగా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 56 ఏళ్లు దాటిన వారు, విద్యా ప్యానెల్ సభ్యులు అర్హులు కారని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఒక్కో పోస్టుకు ఇద్దరి చొప్పున ఎంపిక చేసి, జిల్లా కలెక్టర్, విద్యాధికారి, నాణ్యతా సమన్వయకర్తలతో కూడిన కమిటీ ముఖాముఖి ద్వారా తుది ఎంపిక చేస్తారని ఆమె వివరించారు. అర్హులైన అభ్యర్థులు నిర్దేశిత పత్రంలో సేవా వివరాలు, విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలతో సహా అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, భూపాలపల్లికి సమర్పించాలని ఆమె సూచించారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

డిఎంహెచ్ ఓ డాక్టర్ అప్పయ్య



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 8 (జనం సాక్షి) :** హనుమకొండ లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అప్పయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరోకేర్ హాస్పిటల్, శాంతి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, డా. సుమన్ కిడ్నీ ఆండ్రో కేర్ హాస్పిటల్, వేద హాస్పిటల్లను సందర్శించి ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, సంబంధిత రికార్డులు, సిబ్బంది వివరాలు, పరిశుభ్రత, రోగుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, డయాగ్నస్టిక్ కేంద్రా లు తదితర వైద్య సంస్థలుక్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్ట నిబంధనల కింద తప్పనిసరిగా నమోదు చేసుకుని, చట్టంలోని నిబంధనలు మరియు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వైద్య సంస్థలపై సట్టా ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డా. అప్పయ్య స్పష్టం చేశారు.

## బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



**కాళేశ్వరం , అక్టోబర్ 8 (జనం సాక్షి) :** బతుకమ్మ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటించాలని మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. బతుకమ్మ కార్యక్రమానికి ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, అవసరమైన అనుమతులు,సూచనలు తీసుకోవాలి అని తెలిపారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించరాదు అని కార్యక్రమ ప్రదేశంలో మద్యం సేవించి అల్లర్లు చేయడం, గొడవలు పడడం, అసభ్యకర ప్రవర్తనకు పాల్పడడం వంటి వాటిని అనుమతించరాదు అని అన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగంలో పోలీసుల సూచనలు మరియు శబ్ద కాలుష్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి అని బాణసంచా వినియోగిస్తే తగిన భద్రతా చర్యలు తీసుకోవాలి. ప్రమాదకరమైన రీతిలో బాణసంచా కాల్చరాదు అని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి స్వయంగా వాటిని తాకకుండా జాగ్రత్త వహించాలి అని తెలిపారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలి అని అన్నారు. బతుకమ్మ పండుగను అందరూ ఆనందంగా, సురక్షితంగా మరియు ప్రశాంతంగా జరుపుకోవడానికి నిర్వాహకులు, యువత మరియు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని మహదేవపూర్ సిఐ కోరారు.

## వరంగల్ శ్రీ భద్రకాళీ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు

**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 8 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన వరంగల్ భద్రకాళీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ నెల తేదీ. 11-10-2026 ఆదివారం నుండి 21-10-2026 బుధవారం వరకు 11 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల కరపత్రాన్ని ఆలయ అధికారులు విడుదల చేశారు. ప్రతిరోజు ఉదయం 4 నుండి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 1 నుండి రాత్రి 8 వరకు దర్శన వేళలుగా నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టనున్నారు. అదేవిధంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 21న శ్రీభద్రకాళి అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఈవో సునీత, ఆలయ అధికారులు అర్చకులు పాల్గొన్నారు.

## ఎక్స్‌టర్నల్ ఎవల్యూషన్ సెంటర్ సుదర్శన

**గూడూరు,అక్టోబర్08(జనంసాక్షి):** ఎక్స్‌టర్నల్ ఎవల్యూషన్ పకడ్బందీగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఇన్చార్జి అధికారి మండల శ్రీరాములు తెలిపారు. గురువారం గూడూరు మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో ఎక్స్‌టర్నల్ ఎవల్యూషన్ సెంటర్ ను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో గూడూరు మండలంలో నిర్వహిస్తున్న ఎక్స్టర్నల్ ఎవల్యూషన్ ప్రక్రియను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పరీక్ష మూల్యాంకన ప్రక్రియకు సంబంధించిన రికార్డులు,విద్యార్థుల హాజరు,మూల్యాంక అనే విధానం,భద్రత ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియలో నిబంధనలు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.